

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేశాం. 'చెప్పాం.. చేస్తున్నాం' నినాదంతో ప్రజల ముందుకు వస్తున్నాం. స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను ఆశీర్వదించి భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరుతున్నాం.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



బుధవారం 28.10.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 | సంచిక - 187 | www.journalistfile.com | పేజీలు 8 | వెల : రూ.5.00


# ట్రిపుల్ ఇంజన్ సర్కారుతోనే అభివృద్ధిలో వేగం






- కూటమి ఉమ్మడి నిర్ణయంతోనే స్థానిక సీట్ల సర్దుబాటు
- రెండున్నరేళ్ల అభివృద్ధిని గుర్తించి ఆశీర్వదించండి
- స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించండి
- వైసీపీపై సీఎం చంద్రబాబు తీవ్ర విమర్శలు
- కూటమి అగ్రనేతల సంయుక్త మీడియా సమావేశం

**అమరావతి, అక్టోబరు 27(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని గొడ్డలి పార్టీ సహించలేకపోతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరగకుండా అడ్డుకోవటం ద్వారా రాష్ట్రాభివృద్ధిని నిరోధించటమే ఆ పార్టీ వైఖరి అని ఆయన అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచి చెడులను విశ్లేషించి ఓటు వేయాలని... గడచిన రెండున్నరేళ్లలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని గుర్తించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సీఎం క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ లతో కలిసి సంయుక్తంగా నిర్వహించిన మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. దీనిపై సీఎం మాట్లాడుతూ.."గత పాలకులు విధ్వంసంతోనే పాలన చేశారు. కూటమిగా ఏర్పడి గత ప్రజా కంటక పాలనను అంతమొందించాం. విధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్నిర్మించే బాధ్యతను ప్రజలు మాకు అప్పగించారు. మిగతా 2లో...

## అర్నబ్‌పై సర్వసన్నద్ధం



- ప్రాణ, ఆస్తి నష్ట నివారణకు ముందస్తు చర్యలు
- 84,396 మందిని 290 తుపాను షెల్టర్లకు తరలింపు
- ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు

2లో

## ధరల కట్టడికి సర్కారు దన్ను

- నిత్యావసరాలు తక్కువ ధరలకే
- ధరణి బియ్యం విక్రయాలు మున్సిపాలిటీలు, మండల కేంద్రాలకు విస్తరణ
- నిత్యావసరాల ధరల నియంత్రణపై సీఎం చంద్రబాబు సమీక్ష

2లో





## వైద్య సేవలకు పకడ్బందీ ఏర్పాట్లు

- ఆర్టీజీఎస్‌తో 2,259 అంబులెన్సుల అనుసంధానం
- వైద్య సిబ్బంది సెలవుల రద్దు.. 1,050 వైద్య బృందాల సిద్ధం
- 8,441 అత్యవసర పడకలు అందుబాటులోకి
- అర్నబ్ తుపాను సన్నద్ధతపై మంత్రి సత్యకుమార్ సమీక్ష

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ):** తుపాను ప్రభావం కారణంగా అవసరమైన వారికి వెనువెంటనే వైద్య సేవలు అందించేందుకు అవసరమైన అన్ని ముందస్తు ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. వైద్య సేవల్లో లోపం రాకుండా ఉండేందుకు వైద్యులు, పారామెడికల్ సిబ్బంది సెలవులను రద్దు చేసినట్లు తెలిపారు. తుపాను ప్రభావం తగ్గిన అనంతరం అంటువ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసినట్లు చెప్పారు. తుపాను కారణంగా విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడితే వెంటనే పునరుద్ధరించేందుకు జనరేటర్ల వినియోగానికి అవసరమైన ఇంధనాన్ని అదనంగా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి బోధనాసుపత్రుల వరకు మొత్తం 8,441 అత్యవసర పడకలను అందుబాటులో ఉంచామని తెలిపారు. 1,050 వైద్య బృందాలను సిద్ధం చేశామని చెప్పారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన 38 బాధితుల సహాయక శిబిరాల్లో వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ముఖ్యంగా తుపాను ప్రభావం తీవ్రంగా ఉంటుందని ప్రభుత్వం గుర్తించిన 20 జిల్లాల్లోని మిగతా 2లో...

## తుపానుపై జలవనరుల శాఖ అప్రమత్తం



- బుడమేరు, ఏలేరుపై ప్రత్యేక నిఘా
- నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చర్యలు
- రిజర్వాయర్లకు వరద ప్రవాహాలపై ముందస్తు అంచనా: మంత్రి నిమ్మల ఆదేశాలు

2లో

## అర్నబ్ విపత్తుని సమర్థంగా ఎదుర్కోవాలి

- ప్రాణ నష్టం జరగకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలి
- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



**కాకినాడ (జర్నలిస్ట్ ఫైల్ )**అర్నబ్ అతి తీవ్ర తుపాను నేపథ్యంలో ప్రజల ప్రాణ రక్షణకే అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కాకినాడ జిల్లా కలెక్టర్, అధికారులను ఆదేశించారు. తుపాను ప్రభావిత తీర, లోతట్టు ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్త చర్యలను పటిష్ఠంగా అమలు చేయాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

తాళ్లరేవు, యు.కొత్తపల్లి, కాకినాడ అర్బన్, కాకినాడ రూరల్, కరప, తొండంగి మండలాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. 50 గ్రామాలు, లోతట్టు ప్రాంతాలతో కలిపి 92 ఆవాసాల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే ప్రక్రియను మిగతా 2లో...

## ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై 33,014 కేసులు

- స్థానిక ఎన్నికల్లో కోడ్ ఉల్లంఘనలపై ఉక్కుపాదం
- ఒక్కరోజే 9 ఎఫ్ఐఆర్‌లు.. 1,179 మందిపై బైండ్‌ఓవర్ చర్యలు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ) :** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలు, శాంతిభద్రతలపై రాష్ట్ర ఎన్నికల సంఘం నిఘాను మరింత పెంచింది. ఎన్నికల నిర్వహణలో భాగంగా చేపట్టిన




3లో

## తుపానుపై పవర్‌ఫుల్ నిఘా



- విద్యుత్ శాఖలో 6 వేల మంది సిబ్బంది అప్రమత్తం
- 1912కు ఒకేసారి 30 వేల కాల్స్ స్వీకరించే ఏర్పాట్లు
- సరఫరా పునరుద్ధరణకు ముందస్తు సన్నద్ధత
- మంత్రి గొట్టిపాటి రవి సమీక్ష

3లో

## ఆర్నబ్‌పై అప్రమత్తం



- ఒక్క ప్రాణం కూడా పోకూడదు
- రైతులు, పంటలు, పశుసంపద రక్షణకు ముందస్తు చర్యలు
- ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి
- పునరావాస కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలి
- మూడు జిల్లాల అధికారులతో మంత్రి అచ్చెన్నాయుడు టెలికాన్ఫరెన్స్

3లో

## అర్నబ్ తుపాన్‌పై ఆర్టీజీఎస్ నిరంతర పర్యవేక్షణ

- ముందస్తు సన్నద్ధతా చర్యలపై సీఎం చంద్రబాబు, ఆర్టీజీ శాఖ మంత్రి నారా లోకేష్, హోం మంత్రి అనిత సమీక్ష



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ) :** అర్నబ్ తుపాన్ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. తుపాన్ ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు వివిధ శాఖలు చేపట్టిన ముందస్తు సన్నద్ధత, ప్రజల భద్రత, అత్యవసర సహాయక చర్యలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆర్టీజీ శాఖ మంత్రి నారా లోకేష్, హోం మంత్రి వంగలపూడి అనితలు నిరంతరం సమీక్షిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా తుపాన్ పరిస్థితులను రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) సంస్థ న నుంచి అధికారులు జిల్లాల్లలోని పరిస్థితులను రేయింబవళ్లు నిరంతరాయంగా పర్యవేక్షిస్తూ ఎక్కడా కూడా ఎలాంటి సమన్వయ లోపం లేకుండా చూస్తున్నారు. తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితులు, ముందస్తు ఏర్పాట్లకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులకు చేరవేస్తున్నారు.

**ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధం :** తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో అత్యవసర సహాయక చర్యలు చేపట్టేందుకు 14 జిల్లాలకు 12 ఎన్డీఆర్ఎఫ్, 10 ఎస్డీఆర్ఎఫ్ బృందాలను తరలించారు. రాష్ట్రవ్యాప్తంగా 20 జిల్లాల్లో 2,131 తుపాన్ షెల్టర్లను సిద్ధం చేశారు. 18 జిల్లాల్లో 2.70 కోట్ల మంది మొబైల్ ఫోన్లకు నిరంతరం తుపాన్ హెచ్చరికలు జారీ చేస్తున్నారు. మత్స్యకారుల భద్రతకు ప్రాధాన్యమిస్తూ 30,043 ఫిషింగ్ బోట్లను తీర ప్రాంతాల్లో నిలిపివేశారు. ప్రస్తుతం ఒక్క ఫిషింగ్ బోటు కూడా సముద్రంలో లేకుండా జాగ్రత్తలు పాటించారు.

**వైద్య సేవలు, అత్యవసర సదుపాయాలు సిద్ధం :** తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు 1,087 వైద్య బృందాలను ఏర్పాటు చేశారు. 8,281 అత్యవసర పడకలు, 1,274 అంబులెన్సులను సిద్ధంగా ఉంచారు.

పాముకాటు బాధితులకు సకాలంలో చికిత్స అందించేందుకు ఆసుపత్రుల్లో 21,536 యాంటీ స్నేక్ వీనం డోసులను అందుబాటులో ఉంచారు. ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా 1,351 మంది గర్భిణులను ఇప్పటికే సురక్షితంగా ఆసుపత్రులకు తరలించారు. తాగునీరు, మిగతా 3లో...

## ముందస్తు చర్యల్లో నిర్లక్ష్యం వద్దు



- ప్రజల భద్రతే ప్రథమ ప్రాధాన్యం
- తుపాను పరిస్థితులపై కలెక్టర్లతో హోంమంత్రి అనిత టెలీకాన్ఫరెన్స్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ):** అర్నబ్ తుపాను నేపథ్యంలో ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో హోంమంత్రి వంగలపూడి అనిత టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. తుపాను పరిస్థితులు, ప్రభుత్వ యంత్రాంగం చేపట్టాల్సిన మిగతా 3లో...

## పరిషత్ ఎన్నికల్లో భారీగా ఏకగ్రీవాలు

- వైసీపీ కంచుకోట పులివెందులలోనూ టీడీపీ ప్రభంజనం

3లో

# వైద్య సేవలకు పకడ్బందీ ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి)

96 మండలాల్లో వైద్య సేవల కొనసాగింపుపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. ఈ 96 మండలాల్లో 1,176 ప్రభుత్వ ఆసుపత్రులు ఉన్నాయని చెప్పారు. తుపాను సన్నద్ధతపై మంత్రి సత్యకుమార్ యాదవ్ మంగళవారం సాయంత్రం వర్చువల్‌గా వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి జి. వీరపాండియన్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కేవీఎన్ చక్రధర్‌బాబు, ఆహార భద్రత విభాగం డైరెక్టర్ అరుణ్‌బాబు, వైద్య విద్య సంచాలకుడు డాక్టర్ విష్ణువర్ధన్, ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ వెంకటరమణ, ఇతర ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. అధికారులతో క్షుణ్ణంగా చర్చించిన అనంతరం ఏర్పాట్లు సంతృప్తికరంగా ఉన్నాయని, పర్యవేక్షణ మరింత పెరగాల్సిన అవసరం ఉందని సూచించారు. రెవెన్యూ, పంచాయతీ, ఇతర శాఖల సమన్వయంతో ప్రజలకు వైద్య సేవలు అందించడంలో లోపాలు తలెత్తకుండా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజారోగ్య పరిరక్షణే తమ కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకు అందరూ సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ శాఖాపరమైన సన్నద్ధత వివరాలను పత్రికా ప్రకటనలో వెల్లడించారు.

**108, 104, 102 వాహనాలతో పాటు ప్రైవేట్ అంబులెన్స్‌లు కూడా సిద్ధం :** రాష్ట్రంలో 108, 104 (సంచార వైద్యశాలలు), 102 (తల్లీబిడ్డ) వాహనాలు మొత్తం 1,892ను రియల్ టైమ్ గవర్నెన్స్ సిస్టమ్ (ఆర్టీజీఎస్)తో అనుసంధానం చేసినట్లు తెలిపారు. బాధితుల అవసరాలకు అనుగుణంగా ఈ వాహనాలను సంబంధిత ప్రాంతాలకు పంపేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అంతేకాకుండా అవసరాలకు అనుగుణంగా ప్రైవేటు అంబులెన్సులను వినియోగించుకునేందుకు వివరాలు సేకరించినట్లు తెలిపారు. ఇప్పటివరకు 367 ప్రైవేటు అంబులెన్సులను వినియోగించుకునేందుకు ఆర్టీజీఎస్ ద్వారా అనుసంధానం చేసినట్లు చెప్పారు. దీనివల్ల బాధితులకు సత్వరం వైద్య సేవలు అందించేందుకు వీలుంటుందని వెల్లడించారు.

**పాముకాటు విరుగుడు ఇంజెక్షన్లు, ఇతర మందులు సిద్ధం :** తుపాను సమయంలో అత్యవసరంగా అవసరమయ్యే యాంటీబయాటిక్స్ మందులు, అంటువ్యాధుల కట్టడికి అవసరమైన మందులను అందుబాటులో ఉంచామన్నారు. ముఖ్యంగా పాముకాటు ఘటనలను దృష్టిలో పెట్టుకుని 26,500 ఏవీఎస్ ఇంజెక్షన్లను సిద్ధం చేశామన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి బోధనాసుపత్రుల వరకు మందుల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నామన్నారు.

**హెచ్చరికల ఆధారంగా మండలాల స్థాయిలో మరింత అప్రమత్తం :** వాతావరణ శాఖ హెచ్చరికలకు అనుగుణంగా తుపాను ప్రభావిత జిల్లాలు, మండలాలను గుర్తిస్తూ చర్యలు తీసుకుంటున్నామని మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఈ క్రమంలోనే బుధవారం వర్షాలు, గాలుల తీవ్రతపై వచ్చిన హెచ్చరికలతో 20 జిల్లాల్లోని 255 మండలాల్లో ఆసుపత్రుల వైద్యులు, సిబ్బందిని మరింత అప్రమత్తం చేసినట్లు తెలిపారు. ఇవి శ్రీకాకుళం నుంచి బాపట్ల జిల్లాల వరకు ఉన్నాయని చెప్పారు. అలాగే సచివాలయాల వారీగా కూడా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. విశాఖలాంటి చోట్ల పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో 24 గంటలూ వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు.

**2,838 మంది గర్భిణీల తరలింపు :** ప్రసవ తేదీకి దగ్గర్లో ఉన్న 2,838 మంది గర్భిణీలను సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించినట్లు మంత్రి సత్యకుమార్ వెల్లడించారు. ప్రసవ తేదీ ఆధారంగా స్థానిక వైద్యుల నుంచి సేకరించిన సమాచారంతో గర్భిణులను ఆసుపత్రులకు పంపుతున్నామన్నారు. తుపాను కారణంగా ప్రసవ సమయంలో గర్భిణులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఈ విధమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

**నీటి నాణ్యత పరీక్షలకు చర్యలు :** తుపాను పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని సహాయక శిబిరాలకు సరఫరా చేసే నీటి నాణ్యతను పరీక్షించేందుకు ఆహార భద్రత శాఖ ఇన్‌స్పెక్టర్లను సిద్ధం చేసినట్లు తెలిపారు. అలాగే అవసరమైన వాహనాలను కూడా సిద్ధం చేశామన్నారు. తుపాను ప్రభావం అనంతరం ప్రబలే అంటువ్యాధులను దృష్టిలో ఉంచుకుని సంబంధిత ప్రాంతాల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, మార్గదర్శకాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు వివరించారు.

**ప్రభుత్వ శాఖలతో సమన్వయం.. సత్వర వైద్య సేవలకు సిద్ధం :** వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి వీరపాండియన్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ చక్రధర్‌బాబు మాట్లాడుతూ ఆర్టీజీఎస్ కమాండ్ కంట్రోల్ కేంద్రంలో సీనియర్ వైద్యులు, అధికారులు 24 గంటలపాటు పనిచేస్తున్నారని మంత్రికి వివరించారు. తుపాను ప్రభావిత జిల్లాల్లో టీకాల కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేశామన్నారు. వైద్య విద్య సంచాలకుడు విష్ణువర్ధన్, ప్రజారోగ్య సంచాలకుడు వెంకటరమణ, సంయుక్త సంచాలకుడు అర్జునరావు, ఆహార భద్రత విభాగం డైరెక్టర్ అరుణ్‌బాబు తమ శాఖల పరిధిలో తీసుకుంటున్న చర్యల గురించి మంత్రికి వివరించారు.

# అర్నబ్ విపత్తుని సమర్థంగా ఎదుర్కోవాలి

(మొదటి పేజీ తరువాయి)

వేగవంతం చేయాలని, సాయంత్రంలోపు తరలింపు పూర్తి చేయాలని ఆదేశించారు. సముద్ర తీరానికి మూడు నుంచి ఐదు కిలోమీటర్ల పరిధిలోని పూరిళ్లు, రేకుల ఇళ్లు, శిథిల భవనాల్లో నివసిస్తున్న వారిని ముందుగా తరలించాలని సూచించారు.

పునరావాస కేంద్రాల్లో తాగునీరు, పరిశుభ్రమైన ఆహారం, విద్యుత్, దుప్పట్లు, చిన్నారులకు పాలు, అత్యవసర మందులు అందుబాటులో ఉండాలని పవన్ కళ్యాణ్ ఆదేశించారు. వృద్ధులు, దివ్యాంగులు, చిన్నారులు, గర్భిణులకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ప్రసవ సమయం దగ్గరలో ఉన్న గర్భిణులను ముందుగానే ఆసుపత్రులకు తరలించాలని తెలిపారు.

తుపాను ప్రభావంతో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినే అవకాశం ఉన్నందున విద్యుత్ శాఖ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పరిస్థితులు అనుకూలించిన వెంటనే ఆసుపత్రులు, తాగునీటి పథకాలు, పునరావాస కేంద్రాలకు విద్యుత్ పునరుద్ధరణలో మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. రహదారులపై చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలితే వెంటనే తొలగించేలా జేసీబీలు, క్రేన్లు తదితర యంత్రాలను సిద్ధంగా ఉంచాలని తెలిపారు.

తుపాను సమయంలోనూ సురక్షిత తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని పవన్ కళ్యాణ్ సూచించారు. పునరావాస కేంద్రాలకు ట్యాంకర్ల ద్వారా నీరు అందించాలని, తుపాను అనంతరం అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య చర్యలు వెంటనే చేపట్టాలని ఆదేశించారు. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా, ప్రజలు బీచ్‌ల వద్దకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

వైద్య సేవలకు అంతరాయం లేకుండా 108తో పాటు ప్రైవేటు అంబులెన్సులను సిద్ధంగా ఉంచాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 24 గంటలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులకు పంటల రక్షణపై ముందస్తు సూచనలు చేయాలని, కోతకు వచ్చిన పంటను సురక్షితంగా నిల్వ చేసుకోవాలని, పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు.

పిఠాపురం నియోజకవర్గంలో ఉప్పాడ, కోనపాపపేట, అమీనాబాద్, మూలపేట, కొమరగిరి తదితర ప్రాంతాల్లో పునరావాస ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. గొల్లప్రోలు మండలంలోని వరద ముంపు ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలను సిద్ధంగా ఉంచాలని, రెవెన్యూ, పోలీసు, వైద్య ఆరోగ్య, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

భారీ వర్షాల నేపథ్యంలో ఏలేరు రిజర్వాయర్ నీటి విడుదల, కాలువలు, డ్రైన్ల పరిస్థితిపై నిరంతర నిఘా ఉంచాలని పవన్ కళ్యాణ్ ఆదేశించారు. ఏలేరు వరద ప్రభావానికి గురయ్యే అవకాశం ఉన్న ఎనిమిది మండలాల్లోని 41 గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. జిల్లా, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లోని కంట్రోల్ రూమ్‌ల ద్వారా 24 గంటలూ పరిస్థితిని పర్యవేక్షించాలని, ప్రజలు అధికారిక వాతావరణ హెచ్చరికలను మాత్రమే అనుసరించి అనవసరంగా బయటకు రావద్దని ఉప ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

# ట్రిపుల్ ఇంజన్ సర్కారుతోనే అభివృద్ధిలో వేగం

(మొదటి పేజీ తరువాయి)





ఎల్ నినో కరువు పరిస్థితుల్లోనూ ఎక్కడా అభివృద్ధి ఆగిపోకుండా చర్యలు తీసుకున్నాం. ఇప్పుడు అర్నబ్ తుఫాను లాంటి ప్రకృతి విపత్తు వచ్చింది. సమర్థంగా ఎదుర్కోనేలా యంత్రాంగాన్ని సిద్ధం చేశాం. రాష్ట్ర అభివృద్ధి కోసమే నిరంతరం తపన పడుతున్నాం. స్థానిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని రాష్ట్ర ప్రజలను కోరుతున్నాను. పట్టణ ప్రాంత స్థానిక సంస్థల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నాం. బటన్ నొక్కుతున్నాం గుంతలు పూడ్చలేమని గత పాలకులు చెప్పారు. ఇప్పుడు మేం సంక్షేమం అందిస్తున్నాం... అభివృద్ధి చేసి చూపిస్తున్నాం. సాగునీటి ప్రాజెక్టుల నుంచి డేటా సెంటర్ల వరకూ అభివృద్ధి కనిపిస్తోంది. విశాఖ ఎకనామిక్ రీజియన్, అమరావతి, తిరుపతి ఎకనామిక్ రీజియన్లుగా 3 ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నాం. గ్రీన్ ఎనర్జీ కారిడార్ కింద రూ. 27 వేల కోట్లతో మరో ప్రాజెక్టు రాష్ట్రానికి వచ్చింది. గత పాలకులు గోదావరిలో ముంచేసిన పోలవరం ప్రాజెక్టును వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేస్తాం. రెండేళ్లలో ప్రతీ రంగంలోనూ మార్పు తీసుకువచ్చాం. ప్రతీ కుటుంబానికీ న్యాయం చేస్తున్నాం."అని ముఖ్యమంత్రి అన్నారు.

**లిటిగేషన్లే ఆ పార్టీ రాజకీయం :** స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ వ్యవహరిస్తున్న తీరుపై ముఖ్యమంత్రి తీవ్రస్థాయి విమర్శలు చేశారు. గొడ్డలి పార్టీ నేతలు హింసా విధానాన్ని విడనాడి జనజీవన స్రవంతిలో కలవాలని సూచించారు. సీఎం మాట్లాడుతూ.." రాష్ట్రాన్ని ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా గొడ్డలి పార్టీ వ్యవహరిస్తోంది. రాజకీయ పార్టీకి ఉండాల్సిన తీరుగా వైసీపీ వ్యవహరించటం లేదు. ఆ పార్టీ మంచిని చూడలేక పోతోంది. అభివృద్ధిని సహించలేకపోతోంది. ఎన్నికలు జరగటం ఆ పార్టీకి ఇష్టం లేదు. ఎట్టి పరిస్థితుల్లో ఈ ఎన్నికలు జరగనీయకుండా చూడాలనేది గొడ్డలి పార్టీ ఆలోచన. ఎన్నికలు ఆపడానికి 62 పిటిషన్లు దాఖలు చేశారు. సర్ పైనా, డీలిమిటేషన్, బీసీ రిజర్వేషన్లపైనా కోర్టులకు ఎక్కారు. ఇప్పుడు ఎన్నికలు జరగకపోతే ఆర్థిక సంఘం నిధులు ఆగిపోతాయి. స్థానిక సంస్థలు అభివృద్ధి కావటం ఆ పార్టీకి ఇష్టం లేదు. హింసాత్మక ఘటనలు సృష్టించారు. బెంగుళూరు నుంచి వచ్చి హిట్ అండ్ రన్ తరహాలో వ్యవహరిస్తున్నారు. తీవ్రవాదుల తరహాలో హిట్ అండ్ రన్ చేస్తున్నారు. గొడ్డలి పార్టీ సిద్ధాంతం క్రిమినలైజేషన్, లిటిగేషన్, ఫేక్ ప్రాపగాండా. మా సిద్ధాంతం సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన, సేవా భావం. మా ప్రభుత్వ సహనాన్ని, సంయమనాన్ని కూడా గొడ్డలి పార్టీ దుర్వినియోగం చేస్తోంది. వాళ్ల కుటుంబంలోనూ సంక్షోభాన్ని సృష్టించుకున్నారు. ఆస్తుల కోసం సొంత చెల్లెల్ని, తల్లిని మోసం చేస్తున్నారు. అతని ఆలోచన ప్యాలస్ కోసం, మా ఆలోచన, మా తపన ప్రజలు పేదల కోసం. గొడ్డలి పార్టీ సృష్టించే అడ్డంకులు సమర్థంగా దాటుకుని ముందుకెళ్తాం."అని ముఖ్యమంత్రి వివరించారు.

"రాష్ట్రవ్యాప్తంగా వివిధ పార్టీల నుంచి పెద్ద ఎత్తున నామినేషన్లు దాఖలయ్యాయి. ఎంపీటీసీలకు 46 వేల పైచిలుకు నామినేషన్లు, జెడ్పీటీసీలకు 4,700 పైచిలుకు నామినేషన్లు వచ్చాయి. కూటమిగా ఐక్యంగా కలిసి ముందుకు వెళ్తున్నాం. ప్రజల సంక్షేమం, అభివృద్ధి విషయంలో మేం ఎక్కడా రాజీ పడటం లేదు. అన్ని ప్రాంతాలు, ప్రజలందరికీ న్యాయం జరగాలన్నదే మా మూడు పార్టీల లక్ష్యం. 2024లో చారిత్రాత్మక మద్దతు ఇచ్చినట్టే... మా రెండున్నరేళ్ల కష్టాన్ని గుర్తించి ఆశీం-ర్వదించాలని ప్రజల్ని కోరుతున్నాను. ప్రజల ఓటు మాకు నూతన శక్తిని, సంకల్పాన్ని ఇస్తుంది. స్థానిక సంస్థల్లో ప్రతీ అంశాన్ని బేరీజు వేసుకుని కూటమి సంకీర్ణ ధర్మాన్ని దృష్టిలో ఉంచుకునే సీట్లు ఇచ్చాం. బీఫాం ఇచ్చిన అభ్యర్థులకే కూటమి నేతలు సహకరించాలని అందరినీ కోరుతున్నాం. ఈ స్థాయిలో ఎన్నికల కసరత్తు గతంలో ఎప్పుడూ చేయలేదు. మూడు పార్టీలు సంయుక్తంగా తీసుకున్న నిర్ణయం ఇది. జనాభా దామాషా ప్రకారం సోషల్ రీ ఇంజనీరింగ్ ఆధారంగానే సీట్ల కేటాయింపు జరిగింది. సవాళ్లు, అడ్డంకులు దాటుకుని కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. సీట్ల సర్దుబాటుపై తాను, పవన్ కళ్యాణ్ ఎన్నడూ చేయనంత కసరత్తు చేశాం. ఎంపీటీసీల స్థాయిలో సీట్ల సర్దుబాటు... అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించాం. ఇక స్థానిక సంస్థల్లోనూ కూటమి గెలుపు ద్వారా ట్రిపుల్ ఇంజన్ స్పీడ్ తో అభివృద్ధి చేస్తాం. ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి మద్దతు పలికి ట్రెండ్ సెట్ చేయాలని ప్రజలను కోరుతున్నాను. ప్రస్తుతం స్థానిక సంస్థల్లో సీట్లు ఇవ్వలేని వాళ్లకు న్యాయం చేస్తాం. బీ-ఫాం ఇచ్చిన అభ్యర్థులనే గెలిపించాలి. పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా వ్యవహరించొద్దు."అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**ఈవీఎంలపై ద్వంద్వ వైఖరి :** "రాజ్యాంగబద్ధమైన వ్యవస్థగా ఎన్నికల కమిషన్ ది ఎప్పుడూ ఒకే విధానం. సీఈసీ విషయంలో కొన్ని రాజకీయ పార్టీలు ద్వంద్వ వైఖరులు అనుసరిస్తున్నాయి. సర్ పై ఒకచోట ఒక వైఖరి, మరో చోట మరోవైఖరి అవలంభిస్తారా..? ఇప్పుడు ఆరోపణలు చేస్తున్న పార్టీలు... ఇదే ఈవీఎంలతోనే గెలిచాయి. కేంద్రంపైనా, రాష్ట్రాలపైనా బురద చల్లే ప్రయత్నం చేస్తారా..? దేశాభివృద్ధి కోసం రాష్ట్రాభివృద్ధి కోసం కేంద్రంలో రాష్ట్రంలో ఎన్డీఏ నిరంతరం కృషి చేస్తోంది. కాంగ్రెస్ పార్టీ గెలిచినప్పుడు ఈవీఎంలు కరెక్ట్... ఓడినప్పుడు అవి రాంగ్ అనడం... సరైనదేనా..? ఇదెక్కడి వైఖరి..? జాతీయ స్థాయిలో కొన్ని పార్టీలు వ్యవహరిస్తున్నట్టే... గొడ్డలి పార్టీ నేత తనకు అనుకూలంగా ఉన్నప్పుడు ఒకలా లేనప్పుడు మరోలా వ్యవహరిస్తున్నారు. ఒక వ్యక్తి వైఖరి వల్ల రాష్ట్రం ఎందుకు నష్టపోవాలి. రప్పరప్పా రాజకీయాలు చేసి ప్రజల్ని ఇబ్బందులు పెడతారా..? గతంలో రాజకీయాల్లోకి రౌడీలు వస్తే ప్రజలు గమనించే వారు. ఇప్పుడు రౌడీలే రాజకీయం చేస్తున్నారు. రాష్ట్రాన్ని, దేశాన్ని నిర్మించాలంటే మంచి సమర్థ నాయకత్వమే కావాలి. గత పాలకులు చేసిన అవకతవకల్ని సరిదిద్దటానికి మూడేళ్ల సమయం పట్టింది. ప్రజల పట్ల, రాష్ట్రాభివృద్ధి పట్ల మాది భయం కాదు బాధ్యత." అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

# అర్నబ్‌పై సర్వసన్నద్ధం

**అమరావతి (జర్నలిస్ట్‌ఫైల్ ) :** అర్నబ్ తుఫాను తీవ్రత దృష్టిలో ఉంచుకుని ప్రజలు ప్రభుత్వ సూచనలు పాటిస్తూ సురక్షితంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. తుఫాను ప్రభావంతో శ్రీకాకుళం నుంచి కృష్ణా జిల్లా వరకూ మోస్తారు నుంచి భారీ వర్షాలకు ఆస్కారం ఉందని.. తీరప్రాంతాల్లో భారీ ఈదురు గాలులు కూడా వీయవచ్చని సీఎం తెలిపారు. తుఫాను కారణంగా నష్ట తీవ్రతను తగ్గించేందుకు ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉందని వెల్లడించారు. ఎన్నికల పనుల్లో బిజీగా ఉన్నప్పటికీ నిరంతరం తుపాను సన్నద్ధతపై జిల్లా కలెక్టర్లు, ఇతర ప్రభుత్వ యంత్రాంగంతో సీఎం ప్రతీ గంటకూ సమీక్ష నిర్వహించారు. మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా మేం ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నాం. అర్నబ్ తుపాను రెడ్ కేటగిరీలో ఉంది. అయినా ప్రజలు ఎవరూ భయపడాల్సిన పనిలేదు. శ్రీకాకుళం నుంచి బాపట్ల వరకూ తుపాను ప్రభావం ఉంటుంది. పశ్చిమగోదావరి, కృష్ణా నుంచి శ్రీకాకుళం వరకూ ఎక్కువ వర్షాలు, గాలుల తీవ్రత ఉంటుంది. కాకినాడ సమీపంలోని యానాం వద్ద తీరాన్ని దాటే అవకాశం ఉంటుంది. తుపాను ప్రభావంతో వర్షాలు మీుఅస్త్రుశ్రీుఋుతీుఎ ఉదయం నుంచి ఉత్తరాంధ్రలో ప్రారంభం అయ్యాయి. మీుఅస్త్రుశ్రీుఋుతీుఎ రాత్రికి, దీప్తబఽస్త్రుఋుతీుఎ కూడా వర్షపాతం తీరప్రాంతాల్లో నమోదు అవుతుంది. కోనసీమ, ఏలూరు, పశ్చిమ గోదావరి, మన్యం, విజయనగరం, శ్రీకాకుళం, కాకినాడ తదితర ప్రాంతాల్లో నష్ట తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. కొన్ని చోట్ల అతిభారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి. శ్రీకాకుళంలో 30 సెంటిమీటర్ల, పశ్చిమగోదావరిలో 28, విశాఖ 23 సెంటిమీటర్ల మేర వర్షపాతం నమోదు అయ్యే అవకాశం ఉంది. చాలా చోట్ల 10 సెంటిమీటర్ల కంటే ఎక్కువ వర్షాపాతం నమోదు అవుతుంది. తీర ప్రాంత జిల్లాల్లో సముద్రపు నీరు లోతట్టు ప్రాంతాల్లోకి చొచ్చుకు వచ్చే అవకాశం ఉంది. లోతట్టు ప్రాంతాలు, తీరప్రాంత ప్రజలు ప్రయాణాలు రద్దు చేసుకుని ఇళ్లలోనే సురక్షితంగా ఉండాలని కోరుతున్నాను. సముద్ర తీరగ్రామాలు, లంకలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు తుపాను షెల్టర్లకు వెళ్లాలని విజ్ఞప్తి చేస్తున్నాం." అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**పూర్తిస్థాయి సన్నద్ధతతో యంత్రాంగం :** "ప్రభుత్వానికి ప్రజల ప్రాణాలే ముఖ్యం. తుపాను ప్రభావంతో ఎక్కడా నష్టం జరగకుండా చర్యలు తీసుకున్నాం. 290 షెల్టర్లను ఏర్పాటు చేశాం. 84,396 మందిని షెల్టర్లకు తరలించాం. రాష్ట్ర, జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ లు 24 గంటలూ పనిచేస్తున్నాయి. ప్రతీ గంటకూ తుఫాను హెచ్చరికల బులెటిన్ జారీ చేస్తున్నాం. నిరంతరం తుపాను పై సమీక్ష నిర్వహిస్తున్నాను. తుపాను తీవ్రత ఉండే ప్రాంతాలకే అప్రమత్తతా హెచ్చరికలు జారీ చేశాం. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, నౌకాదళం, కోస్టు గార్డును కూడా అప్రమత్తం చేశాం. వీలైనంత మేర ఆస్తి ప్రాణ నష్టాన్ని తగ్గించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం. మత్స్యకారులకు చెందిన 30 వేల పైచిలుకు బోట్లను సముద్రం నుంచి వెనక్కు రప్పించాం. గోపాల్ పూర్ లో కూడా ఏపీకి చెందిన 93 బోట్లు వాటి సిబ్బంది సురక్షితంగా ఉన్నారు. అత్యవసర వైద్య చికిత్సల కోసం వాహనాలు అంబులెన్సులు సిద్ధం చేశాం. 5 వేల మంది గర్భిణులను ఇప్పటికే ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, సమీప ఆస్పత్రులకు తరలించాం. సురక్షిత మైన తాగునీరు అందించేలా ట్యాంకర్లు, జనరేటర్లను సిద్ధం చేశాం. విద్యుత్ అంతరాయం వస్తే తక్షణం స్పందించేందుకు 8400 మందిని సిద్ధం చేసుకున్నాం. తుపాను ప్రభావంతో 15 వేల వరకూ స్తంభాలు పడిపోయే అవకాశం ఉందని అంచనా వేసి దానికి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నాం. తుఫాను కారణంగా కురిసే భారీ వర్షాలకు ఉత్తర కోస్తాంధ్రలోని నాగావళి, వంశధారలకు వరద వచ్చే అవకాశం ఉంది. అలాగే వివిధ జిల్లాల్లో వాగులు వంకల్లో వరద నీటి ప్రవాహాలను అంచనా వేయటంతో పాటు చెరువులకు గండ్లు పడినా వెంటనే పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాం. "అని ముఖ్యమంత్రి వివరించారు.

**ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో అప్రమత్తం :** "ముంపు గ్రామాల్లో ఆహారం, ఔషధాలు సరఫరా చేసేందుకు డ్రోన్లను వినియోగిస్తున్నాం. 7.16 లక్షల హెక్టార్ల మేర వ్యవసాయ పంటలు, 16 లక్షల ఉద్యాన పంటలు ప్రభావితం అయ్యే అవకాశం ఉంది. అంగన్‌వాడీల నుంచి పిల్లలకు, బాలింతలకు, రేషన్ పంపించేలా కూడా ఏర్పాట్లు చేశాం. క్యాచ్ మెంట్ ఏరియాలో పడే వర్షపు నీటిని రిజర్వాయర్లలో నింపేలా కూడా చర్యలు తీసుకున్నాం. తుఫాను కారణంగా నష్ట ప్రభావాన్ని సాంకేతికత ఆధారంగా అంచనా వేసి నష్ట నివారణ చర్యలు చేపట్టాం. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నాను. గతంలో బుడమేరు వరద సమయంలో నేను విజయవాడ కలెక్టరేట్ లోనే ఉండి పనులు పర్యవేక్షించాను. ప్రాణ, ఆస్తినష్టం వీలైనంత మేర తగ్గించటమే లక్ష్యంగా ఈ ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నాం. సముద్ర తీర ప్రాంత గ్రామాల ప్రజలు మరింత సురక్షితంగా ఉండాలని విజ్ఞప్తి చేస్తున్నాను. నీటి ప్రవాహాల వైపు వెళ్లవద్దని హెచ్చరికలు జారీ చేస్తున్నాం. తీవ్ర తుపానుపై మీుఅస్త్రుశ్రీుఋుతీుఎ రాత్రి కూడా నిరంతరం క్షేత్రస్థాయిలో కలెక్టర్లతో సమీక్ష నిర్వహిస్తాం. హుద్ హుద్ కంటే తీవ్రత తక్కువ ఉన్నట్టుగా అంచనా వేస్తున్నాం. ప్రజలంతా సురక్షితంగా ఇళ్లకే పరిమితం కావాలని పదేపదే విజ్ఞప్తి చేస్తున్నాం. తీరప్రాంతాలు, ముంపు ప్రాంతాల ప్రజలు తుపాను షెల్టర్లకు తరలి వెళ్లాలని కోరుతున్నాం. గాలులు, భారీ వర్షాల కారణంగా ప్రయాణాలు కూడా వాయిదా వేసుకోవాలని సూచిస్తున్నాం. గతంలో హుద్ హుద్ సమయంలో రెస్టోరేషన్ కు తీవ్రంగా శ్రమించాం. రాష్ట్ర ప్రజలు ఎవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదు. ప్రభుత్వం పూర్తి సన్నద్ధతతో ఉంది." యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టేలా నిరంతరం సమీక్ష చేస్తున్నట్టు ముఖ్యమంత్రి వివరించారు.

## తుపానుపై జలవనరుల శాఖ

# అప్రమత్తం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ )** అర్నబ్ తుపాను నేపథ్యంలో జలవనరుల శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండి అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. తుపాను రేపు కోనసీమ మీదుగా తీరం దాటే అవకాశం ఉన్నందున వరద పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎలాంటి నష్టం జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ మేరకు ఇరిగేషన్ ఉన్నతాధికారులతో మంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించి తుపాను సంసిద్ధతపై సమీక్షించారు.

టెలికాన్ఫరెన్స్‌లో ఇరిగేషన్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్, అడ్వైజర్ వెంకటేశ్వరరావు, ఈఎన్‌సీ నరసింహమూర్తి, చీఫ్ ఇంజనీర్లు పాల్గొన్నారు. బుడమేరు, ఏలేరు రిజర్వాయర్ పరివాహక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి ఆదేశించారు. బుడమేరు ఛానెల్‌లో నీటి ప్రవాహానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా తీసుకోవాల్సిన చర్యలను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. బుడమేరు ఛానెల్‌లో నీటి ప్రవాహానికి అడ్డంకులు ఉన్నట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించిన విషయాన్ని మంత్రి అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

బుడమేరు ఛానెల్‌లో ఇప్పటివరకు చేపట్టిన తక్షణ చర్యలపై వెంటనే నివేదిక అందించాలని అధికారులను నిమ్మల రామానాయుడు ఆదేశించారు. అర్నబ్ తుపాను ప్రభావంతో ఏలేరు రిజర్వాయర్‌కు వచ్చే వరద ప్రవాహాన్ని ముందుగానే అంచనా వేసి సమర్థవంతమైన నీటి నిర్వహణ చేపట్టాలని సూచించారు. ఉత్తరాంధ్రలోని నదులకు వచ్చే వరదను కూడా ముందస్తుగా అంచనా వేసి, అవసరమైన వరద నిర్వహణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

తుపాను ప్రభావంతో ప్రజలకు, సాగునీటి వనరులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా జలవనరుల శాఖ అన్ని ముందస్తు చర్యలతో సిద్ధంగా ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో అధికారులు అందుబాటులో ఉండి పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, అవసరమైన చోట వెంటనే సహాయక చర్యలు చేపట్టేలా యంత్రాంగాన్ని సిద్ధంగా ఉంచాలని నిమ్మల రామానాయుడు ఆదేశించారు.

# ధరల కట్టడికి సర్కారు దన్ను

**అమరావతి (జర్నలిస్ట్‌ఫైల్ ) :** రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించి, సామాన్య ప్రజలకు అందుబాటు ధరల్లో సరుకులు అందించడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించారు. వివిధ నిత్యావసర వస్తువుల ధరలను వీలైనంత తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. పెరుగుతున్న నిత్యావసరాల ధరలను నియంత్రించే అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించారు. భవిష్యత్తులో నిత్యావసర వస్తువుల సరఫరా ప్రణాళికలపై చర్చించారు. పౌరసరఫరాల శాఖతో పాటు... వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులతో జరిపిన సమీక్షలో ధరల నియంత్రణకు సంబంధించి కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ మేరకు బియ్యం, కందిపప్పు, పామాయిల్, గోధుమ పిండి వంటి నిత్యావసరాలను తక్కువ ధరలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ధరణి బ్రాండ్ పేరుతో విక్రయిస్తున్న సూపర్ ఫైన్ బియ్యాన్ని రైతుబజార్లకే పరిమితం చేయకుండా మున్సిపాలిటీలు, మండల కేంద్రాలకు విస్తరించాలని ముఖ్యమంత్రి సూచించారు. అలాగే ధరణి బియ్యాన్ని మొబైల్ వాహనాల ద్వారా ప్రజలకు చేరువ చేయాలని స్పష్టం చేశారు. ఫైన్, సూపర్ ఫైన్ రకం బియ్యాన్ని కిలో రూ.49, రూ.50కు విక్రయించాలన్నారు. ఇక బహిరంగ మార్కెట్టులో కూడా బియ్యం ధరలను అదుపులో ఉంచేందుకు సీఎం ఆదేశాలతో మిల్లర్లు, హోల్ సేల్ అసోసియేషన్ ప్రతినిధులతో చర్చిస్తున్నట్లు అధికారులు తెలిపారు. వివిధ రకాల బియ్యం ధరలను తగ్గించి వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురావడానికి మిల్లర్లు, హోల్ సేల్ అసోసియేషన్ ప్రతినిధులు అంగీకరించినట్టు అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. బీపీటీ రకం స్టీమ్ బియ్యాన్ని కిలో రూ. 66కు, సాధారణ రకం స్టీమ్ బియ్యాన్ని కిలో రూ. 47కు మించకుండా విక్రయిస్తామని మిల్లర్లు అంగీకరించారని చెప్పారు. ప్రస్తుతం మార్కెట్‌లో బియ్యం ధరలు పెరుగుతున్న నేపథ్యంలో, ధరణి బ్రాండ్ ద్వారా తక్కువ ధరలకు నాణ్యమైన బియ్యాన్ని అందించడంతో పాటు, ఇతర రకాల బియ్యం ధరలపైనా నియంత్రణ ఉండేలా చూడాలని సీఎం ఆదేశించారు. పొరుగు రాష్ట్రాలకు అక్రమంగా ధాన్యం తరలిపోకుండా అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులు, టోల్‌గేట్ల వద్ద నిఘా పెంచాలని, ధాన్యం, బియ్యంపై మార్కెట్ సెస్సు భారాన్ని తగ్గించే అంశాన్ని పరిశీలించాలని సూచించారు.

**దీపావళి నాటికి రేషన్ షాపుల ద్వారా నిత్యావసరాలు :** కందిపప్పు ధరలను తగ్గించేందుకు తీసుకున్న చర్యలను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. రేషన్ కార్డుదారులకు ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా నెలకు కిలో కందిపప్పును రూ. 100కే అందించేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుతం మార్కెట్‌లో కందిపప్పు కిలో రూ. 170 నుంచి రూ. 200 వరకు పలుకుతున్న నేపథ్యంలో, ప్రభుత్వ జోక్యంతో ధరల భారాన్ని తగ్గించేలా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. దీనికి సంబంధించి కేంద్రం నుంచి అవసరమైన సహాయాన్ని తీసుకోవాలని సీఎం నిర్దేశించారు. రేషన్ షాపుల ద్వారా కందిపప్పు సరఫరాకు అవసరమైన ఏర్పాట్లను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. పామాయిల్ ధరలను తగ్గించి సామాన్యులకు అందుబాటులోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి చెప్పారు. రేషన్ డిపోల ద్వారా లీటరు పామాయిల్‌ను రూ. 125కే అందించేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. దీని కోసం అవసరమైన పామాయిల్‌ను టెండర్ల ద్వారా సేకరించి సరఫరా చేసే ప్రక్రియ చేపట్టాలన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో వంటనూనెల ధరలు పెరిగిన నేపథ్యంలో, ప్రభుత్వ సరఫరా ద్వారా వినియోగదారులకు ఉపశమనం కలిగించాలని పేర్కొన్నారు. అదేవిధంగా గోధుమ పిండిని కూడా రేషన్ దుకాణాల ద్వారా కిలో రూ. 25కే అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కందిపప్పు, పామాయిల్, గోధుమ పిండి వంటి నిత్యావసరాలను దీపావళి పండుగ నాటికి రేషన్ షాపుల ద్వారా అందించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

# ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై 33,014 కేసులు




(మొదటి పేజీ తరువాయి)

చర్యలు, నమోదైన కేసులు, స్వాధీనం చేసుకున్న ఆయుధాల వివరాలను రాష్ట్ర ఎన్నికల సంఘం, ఏపీఎస్ఈసీ కో-ఆర్డినేషన్ ఐజీ బి. రాజాకుమారి మంగళవారం సంయుక్తంగా వెల్లడించారు.

అక్టోబరు 27న ఒక్కరోజే ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి తొమ్మిది ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) 1ఏ, 1బీ నిబంధనల కింద ఇప్పటివరకు 1,177 కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా బీఎన్ఎస్ఎస్ 126, 129 సెక్షన్ల కింద ఒక్కరోజులోనే 1,179 మందిని బైండ్‌ఓవర్ చేసినట్లు వెల్లడించారు.

ఎన్నికల భద్రతలో భాగంగా ఒక్కరోజులో 67 ఆయుధాలను డిపాజిట్ చేయించినట్లు అధికారులు తెలిపారు. ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించేందుకు రాష్ట్రవ్యాప్తంగా 814 స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్ (ఎస్-ఎస్‌టీ)ను రంగంలోకి దించినట్లు వెల్లడించారు. ఈ బృందాలు క్షేత్రస్థాయిలో ఎన్నికల కోడ్ అమలు, అక్రమ కార్యకలాపాలు, అనుమానాస్పద కదలికలపై నిరంతరం నిఘా ఉంచుతున్నాయని పేర్కొన్నారు.

అక్టోబరు 15 నుంచి 27వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 244 ఎఫ్ఐఆర్‌లు నమోదైనట్లు ఎన్నికల సంఘం తెలిపింది. ఇదే సమయంలో ఎంసీసీ ఉల్లంఘనలకు సంబంధించి 33,014 కేసులు నమోదు చేసినట్లు వెల్లడించింది. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఇప్పటివరకు 17,652 మందిని బైండ్‌ఓవర్ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

ఎన్నికల నేపథ్యంలో ఇప్పటివరకు మొత్తం 9,217 ఆయుధాలను స్వాధీనం చేసుకోవడం లేదా డిపాజిట్ చేయించడం జరిగిందని తెలిపారు. 814 స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్ క్షేత్రస్థాయిలో నిరంతరం పనిచేస్తున్నాయని, ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేస్తున్నామని రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.

# డాక్టర్ దక్షిణామూర్తి మృతి వైద్య రంగానికి తీరని లోటు



### ● పార్థివ దేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్ ):** ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ దక్షిణామూర్తి మృతి వైద్య రంగానికి, సమాజానికి తీరని లోటని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. తెనాలిలో డాక్టర్ దక్షిణామూర్తి పార్థివ దేహాన్ని సందర్శించిన ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వైద్య రంగంలో డాక్టర్ దక్షిణామూర్తి అందించిన సేవలను ఆలపాటి రాజేంద్రప్రసాద్ స్మరించుకున్నారు. గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న ఎంతోమంది రోగులకు వైద్య సేవలు అందించి, వారి జీవితాల్లో భరోసా నింపారని పేర్కొన్నారు. వైద్య వృత్తిని సేవగా భావించి అంకితభావంతో పనిచేసిన ఆయన సేవలు చిరస్మరణీయమని అన్నారు.

"వైద్య వృత్తి కేవలం ఉపాధి కాదు.. ప్రజల ప్రాణాలను కాపాడే పవిత్రమైన సేవ. తన వైద్య సేవలతో ఎంతోమంది జీవితాల్లో ఆశలు నింపిన డాక్టర్ దక్షిణామూర్తి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు" అని ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు.

డాక్టర్ దక్షిణామూర్తి ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యం కలగాలని భగవంతుడిని ప్రార్థించారు.

# 12వ పీఆర్సీకి కార్యదర్శిగా లక్ష్మీనరసింహం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ):** ఆంధ్రప్రదేశ్‌లో 12వ వేతన సవరణ సంఘం (పీఆర్సీ) ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా 2003 బ్యాచ్‌కు చెందిన విశ్రాంత ఐఏఎస్ అధికారి లక్ష్మీనరసింహంను 12వ వేతన సవరణ సంఘం కార్యదర్శిగా నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ ఇనావ ఉత్తర్వులు జారీ చేశారు. లక్ష్మీనరసింహం బాధ్యతలు స్వీకరించిన రోజు నుంచి నియామకం అమల్లోకి వస్తుందని ఉత్తర్వుల్లో ప్రభుత్వం స్పష్టం చేసింది. 12వ వేతన సవరణ సంఘం కార్యాలయం కొనసాగుతున్న కాలవ్యవధి వరకే ఆయన పదవీకాలం ఉంటుందని పేర్కొంది. పీఆర్సీకి సంబంధించిన పరిపాలనా వ్యవహారాలను సమన్వయం చేయడంతో పాటు అవసరమైన సమాచార సేకరణ, వివిధ శాఖలతో సమన్వయంలో కార్యదర్శి కీలక పాత్ర పోషించనున్నారు. ఇప్పటికే 12వ వేతన సవరణ సంఘం కమిషనర్‌గా 1983 బ్యాచ్‌కు చెందిన విశ్రాంత ఐఏఎస్ అధికారి దినేశ్‌కుమార్‌ను ప్రభుత్వం నియమించింది. ఆయన గతంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు కొత్త వేతన సవరణ అమలు చేయాలన్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. పీఆర్సీ తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించేందుకు ఏడాది గడువు విధించారు. ఈ కాలంలో వివిధ ప్రభుత్వ శాఖల నుంచి ఉద్యోగుల వేతనాలు, సేవా పరిస్థితులు, ఆర్థిక అంశాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించడంతో పాటు ఉద్యోగ సంఘాలతో చర్చలు నిర్వహించనున్నారు. అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని కొత్త వేతన సవరణకు సంబంధించిన సిఫారసులను రూపొందించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది.

# పరిషత్ ఎన్నికల్లో భారీగా ఏకగ్రీవాలు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ) :** ఆంధ్రప్రదేశ్‌లో పరిషత్ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగియడంతో కూటమి పార్టీల ఆధిపత్యం స్పష్టమైంది. నామినేషన్ల ఉపసంహరణకు మంగళవారం మధ్యాహ్నంతో గడువు ముగియగా, పోటీ లేని స్థానాల్లో ఆయా జిల్లాల ఎన్నికల అధికారులు ఏకగ్రీవ ఫలితాలను ప్రకటిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలను టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు దక్కించుకున్నారు.



వైఎస్సార్సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సొంత నియోజకవర్గం పులివెందులలోనూ కూటమి అభ్యర్థులు సత్తా చాటారు. నియోజకవర్గంలోని 65 ఎంపీటీసీ స్థానాలకు గాను 64 స్థానాలు ఏకగ్రీవం కాగా.. ఏడు జడ్పీటీసీ స్థానాల్లో మూడు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. దీంతో పులివెందులలో కూటమి రాజకీయ బలం గణనీయంగా పెరిగిందనే సంకేతాలు వెలువడ్డాయి.

వేంపల్లి మండలంలో మొత్తం 18 ఎంపీటీసీ స్థానాలకు 17 ఏకగ్రీవమయ్యాయి. వీటిలో టీడీపీ 15, బీజేపీ ఒకటి, జనసేన ఒక స్థానాన్ని దక్కించుకున్నాయి. దీంతో అల్లిరెడ్డిపల్లె ఎంపీటీసీ స్థానానికి మాత్రమే ఎన్నిక జరగనుంది. పులివెందుల మండలంలోని ఐదు ఎంపీటీసీ స్థానాలను టీడీపీ ఏకగ్రీవంగా కైవసం చేసుకుంది.

తొండూరు మండలంలో ఎనిమిది, సింహాద్రిపురం మండలంలో ఎనిమిది, వేముల మండలంలో ఎనిమిది ఎంపీటీసీ స్థానాల్లోనూ టీడీపీ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చక్రాయపేట మండలంలో తొమ్మిది, లింగాల మండలంలో తొమ్మిది ఎంపీటీసీ స్థానాలను కూడా టీడీపీ దక్కించుకుంది. దీంతో పులివెందుల నియోజకవర్గంలోని పలు మండలాల్లో కూటమి పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది.

ప్రొద్దుటూరులోనూ కూటమి హవా కొనసాగింది. మొత్తం 24 ఎంపీటీసీ స్థానాలకు గాను 23 స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. వీటిలో టీడీపీకి చెందిన 20 మంది, జనసేనకు చెందిన ముగ్గురు అభ్యర్థులు విజయం సాధించారు. వారికి అధికారులు అధికారికంగా డిక్లరేషన్లు అందజేశారు.

పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గంలో కూటమి అభ్యర్థులు ఎంపీటీసీ స్థానాలను దాదాపు క్లీన్‌స్వీప్ చేశారు. మొత్తం 57 స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. పిడుగురాళ్లలో 18కు 18, మాచవరంలో 15కు 15, గురజాలలో 12కు 12, దాచేపల్లిలో 12కు 12 స్థానాలను కూటమి అభ్యర్థులు ఏకగ్రీవంగా దక్కించుకున్నారు.

పెదకూరపాడు నియోజకవర్గంలోనూ ఇదే పరిస్థితి కనిపించింది. అచ్చంపేట, క్రోసూరు, అమరావతి, పెదకూరపాడు మండలాల్లోని మొత్తం 60 ఎంపీటీసీ స్థానాల్లో కూటమి అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు.

పుంగనూరు నియోజకవర్గంలోనూ టీడీపీ ఆధిపత్యం కొనసాగింది. నాలుగు మండలాల్లో ఎంపీటీసీ స్థానాల్లో గణనీయమైన సంఖ్యలో ఏకగ్రీవాలు నమోదయ్యాయి. సోమలలో 12కి 10, పులిచర్లలో 11కి 8, చౌడేపల్లిలో 12కి 12, రొంపిచర్లలో 8కి 8 ఎంపీటీసీ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. చౌడేపల్లి, రొంపిచర్లలో టీడీపీ పూర్తిస్థాయిలో ఆధిపత్యం ప్రదర్శించింది.

జడ్పీటీసీల్లోనూ కూటమి జోరు : జడ్పీటీసీ స్థానాల్లోనూ కూటమి అభ్యర్థులు భారీగా ఏకగ్రీవమయ్యారు. కడప జిల్లాలోని 39 జడ్పీటీసీ స్థానాల్లో 23 చోట్ల కూటమి అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చిత్తూరు జిల్లాలో మూడు జడ్పీటీసీ స్థానాలను టీడీపీ దక్కించుకుంది. యాదమర్రి నుంచి యశోద, బంగారుపాళ్యం నుంచి సుచిత్ర జయప్రకాశ్, పూతలపట్టు నుంచి శైలజ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

చిలకలూరిపేట నియోజకవర్గంలోనూ టీడీపీ అభ్యర్థులు జడ్పీటీసీ స్థానాలను ఏకగ్రీవంగా కైవసం చేసుకున్నారు. చిలకలూరిపేట నుంచి సుదర్శనం ఏసురత్నం, యడ్లపాడు నుంచి గుంటి యమున, నాదెండ్ల నుంచి దావల రవికుమార్ ఏకగ్రీవమయ్యారు. శావల్యాపురం జడ్పీటీసీగా టీడీపీ అభ్యర్థి అమృతపూడి విశ్రాంతమ్మ కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ప్రకాశం జిల్లా మర్రిపూడి జడ్పీటీసీగా టీడీపీ అభ్యర్థి గురిజాల రాజా, మార్కాపురం జిల్లా కొమరోలు జడ్పీటీసీగా హరితమ్మ, నంద్యాల జిల్లా బేతంచర్ల జడ్పీటీసీగా టీడీపీ అభ్యర్థి పోలూరు రాఘవరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

దెందులూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కుమార్తె సాయినవ్యశ్రీ ఏకగ్రీవంగా జడ్పీటీసీగా ఎన్నికయ్యారు. పెదవేగి జడ్పీటీసీ స్థానానికి ఆమె నామినేషన్ దాఖలు చేయగా, ఇతర పార్టీల అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో ఆమె ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ ధ్రువీకరించారు.

నామినేషన్ల ఉపసంహరణతో వెలువడుతున్న ఏకగ్రీవ ఫలితాలు రాష్ట్రంలోని పరిషత్ ఎన్నికల సమీకరణాలను మార్చేలా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా గతంలో వైసీపీకి బలమైన ప్రాంతాలుగా ఉన్న పులివెందుల, కడపతో పాటు పల్నాడు, చిత్తూరు, ప్రకాశం, నంద్యాల, ఏలూరు జిల్లాల్లో కూటమి అభ్యర్థులు సాధించిన ఏకగ్రీవ విజయాలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి.

# తుపానుపై పవర్‌ఫుల్ నిఘా

(మొదటి పేజీ తరువాయి)

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ) :** 'అర్నబ్' తుపాను నేపథ్యంలో విద్యుత్ శాఖ అప్రమత్తమైంది. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రాణనష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిన ప్రాంతాల్లో త్వరితగతిన పునరుద్ధరణ పనులు చేపట్టేందుకు సుమారు 6 వేల మంది అనుభవజ్ఞులైన అధికారులు, సిబ్బందిని సిద్ధం చేసినట్లు తెలిపారు. మంగళవారం అమరావతిలోని క్యాంపు కార్యాలయం నుంచి విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో తుపాను సన్నద్ధత, విద్యుత్ సరఫరా పరిస్థితి, అత్యవసర సేవలపై సమీక్షించారు.



సెలవులు రద్దు.. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ : తుపాను ప్రభావం లేని ప్రాంతాల్లోని అవసరమైన సిబ్బంది సెలవులను రద్దు చేసి, ప్రభావిత ప్రాంతాలకు తరలించినట్లు మంత్రి తెలిపారు. విద్యుత్ సంస్థల డైరెక్టర్లు, అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచనలకు అనుగుణంగా ముందస్తు చర్యలు చేపట్టినట్లు వివరించారు. విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ ప్రాంతాల్లో డైరెక్టర్లు స్వయంగా పర్యటిస్తూ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు.

తెగిపడిన విద్యుత్ తీగలు, కూలిన స్తంభాలు, దెబ్బతిన్న కండక్టర్ల మరమ్మతులతోపాటు సమస్యలు తలెత్తిన 132 కేవీ సబ్‌స్టేషన్ల వద్ద పునరుద్ధరణ పనులు చేపట్టేందుకు సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు వెల్లడించారు. తుపాను తీవ్రత దృష్ట్యా అవసరమైన విద్యుత్ సామగ్రిని డివిజనల్ కార్యాలయాలు, మండల కేంద్రాల్లో ముందుగానే సిద్ధం చేసినట్లు చెప్పారు.

ఒకేసారి 30 వేల కాల్స్ స్వీకరణ : విద్యుత్ సరఫరా అంతరాయాలు, తెగిపడిన తీగలు, కూలిన స్తంభాలపై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వెంటనే స్పందించేందుకు 1912 కాల్‌సెంటర్‌ను బలోపేతం చేసినట్లు గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ఒకేసారి 30 వేల కాల్స్ స్వీకరించేలా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. విద్యుత్‌కు సంబంధించిన సమస్యలు ఎదురైతే ప్రజలు 1912కు సమాచారం అందించాలని సూచించారు.

ఇతర శాఖలతో సమన్వయం : అత్యవసర పరిస్థితుల్లో సహాయక చర్యలు వేగవంతం చేసేందుకు విద్యుత్ శాఖ ఇతర ప్రభుత్వ విభాగాలతో సమన్వయం పెంచింది. తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, కలెక్టరేట్ సిబ్బంది, రెవెన్యూ అధికారులు, స్థానిక సచివాలయ సిబ్బందితో నిరంతరం సమాచార మార్పిడి జరిగేలా ప్రత్యేక గ్రూపును ఏర్పాటు చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఏ శాఖకు విద్యుత్ సమస్యకు సంబంధించిన సమాచారం అందినా వెంటనే ఆ గ్రూపులో పంచుకునేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. దీనివల్ల సంబంధిత ప్రాంతాల్లోని సిబ్బంది త్వరగా స్పందించి సమస్యలను పరిష్కరించేందుకు వీలవుతుందన్నారు.

విద్యుత్ తీగలను తాకొద్దు : తుపాను ప్రభావిత ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. తెగిపడిన విద్యుత్ తీగలు, కండక్టర్లను చేతితో తాకవద్దని హెచ్చరించారు. రహదారులపై పడిన విద్యుత్ పరికరాల దగ్గరకు వెళ్లడం కూడా ప్రమాదకరమని తెలిపారు. అలాంటి ఘటనలు కనిపిస్తే వెంటనే విద్యుత్ శాఖ సిబ్బందికి లేదా 1912 కాల్‌సెంటర్‌కు సమాచారం అందించాలని కోరారు.

ప్రాణనష్టం జరగకుండా, సాధ్యమైనంత మేర ఆస్తి నష్టాన్ని నివారించేలా అన్ని ముందస్తు చర్యలు చేపట్టినట్లు గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. తుపాను సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉంటూ అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# అర్నబ్ తుపాన్‌పై ఆర్టీజీఎస్ నిరంతర పర్యవేక్షణ



(మొదటి పేజీ తరువాయి)

విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా 2,613 నీటి ట్యాంకర్లు, 2,430 జనరేటర్లు, 4,448 ఆర్వో ప్లాంట్లను సిద్ధం చేశారు.

నిత్యావసర సరుకుల నిల్వలు.. రైతులకు సూచనలు : తుపాన్ సమయంలో ప్రజలకు నిత్యావసర వస్తువుల కొరత తలెత్తకుండా 14,686 రేషన్ దుకాణాల్లో రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను ముందుగానే నిల్వ చేశారు. పంటలకు నష్టం వాటిల్లకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని 35.96 లక్షల మంది రైతులకు సూచనలు జారీ చేశారు. వర్షాలు, ఈదురుగాలుల వల్ల పంటలకు నష్టం కలగకుండా అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు ప్రభుత్వ వసతి గృహాలపై అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టారు. ముఖ్యంగా 419 గిరిజన హాస్టళ్లలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ హాస్టళ్లలో నివసిస్తున్న 88,083 మంది విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేశారు.

రహదారుల పునరుద్ధరణకు యంత్రాలు సిద్ధం : తుపాన్ ప్రభావంతో చెట్లు కూలడం, రహదారులకు అంతరాయం ఏర్పడే పరిస్థితులను ఎదుర్కొనేందుకు రోడ్లు, భవనాల శాఖ 550 జేసీబీలు, 596 ఎలక్ట్రిక్ రంపాలను సిద్ధంగా ఉంచింది. రాష్ట్రవ్యాప్తంగా 1,079 జలాశయాల వద్ద పరిస్థితులను అధికారులు నిరంతరం సమీక్షిస్తూ, నీటిమట్టాలు తదితర అంశాలను పర్యవేక్షిస్తున్నారు.

ఆర్టీజీఎస్ నుంచి నిరంతర పర్యవేక్షణ : తుపాన్ సంబంధిత పరిణామాలు, జిల్లాల్లో ముందస్తు సన్నద్ధత, అత్యవసర సేవల లభ్యతను ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి అధికారులు పర్యవేక్షిస్తున్నారు. జిల్లాల్లో చేపట్టిన ముందస్తు సన్నద్ధత చర్యలను ఆర్టీజీ కార్యదర్శి భాస్కర్ కాటంనేని, ఆర్టీజీఎస్ సీఈఓ ప్రఖర్ జైన్ నిరంతరం సమీక్షిస్తున్నారు. ఆర్టీజీఎస్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ సమన్వయంతో తుపాన్ ప్రభావిత జిల్లాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు విశ్లేషిస్తూ, అవసరమైన సమాచారాన్ని సంబంధిత జిల్లా యంత్రాంగాలకు చేరవేస్తున్నాయి. ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యమిస్తూ, ప్రాణనష్టం వాటిల్లకుండా జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సహాయం అందించడం, వివిధ శాఖల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడంపై రాష్ట్ర యంత్రాంగం దృష్టి సారించింది.

# ఆర్నబ్‌పై అప్రమత్తం

**అమరావతి, అక్టోబర్ 27 (జర్నలిస్ట్ ఫైల్ ):** ఆర్నబ్ తుఫాను నేపథ్యంలో ఒక్క ప్రాణనష్టం కూడా జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని, రైతులు, పంటలు, పశుసంపద, ప్రజల ఆస్తులకు నష్టం తగ్గించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. మంగళవారం శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, జాయింట్ కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి తుఫాను ముందస్తు ఏర్పాట్లను సమీక్షించారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం అక్టోబర్ 28న యానాం సమీపంలో తుఫాను తీరం దాటే అవకాశం ఉందని, గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వేగంతో, గరిష్ఠంగా 140 కిలోమీటర్ల వరకు గాలులు వీచే ప్రమాదమున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



తీరప్రాంతాలు, లోతట్టు గ్రామాలు, వరద ముంపు ప్రాంతాలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదమున్న ప్రదేశాల్లో ప్రజలను ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని మంత్రి ఆదేశించారు. మూడు జిల్లాల్లో 24 గంటల కంట్రోల్ రూములు ఏర్పాటు చేసి పునరావాస కేంద్రాల్లో ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాలు, విద్యుత్ ఏర్పాట్లు కల్పించాలన్నారు. గర్భిణులు, వృద్ధులు, చిన్నారులు, దివ్యాంగులకు ప్రత్యేక రక్షణ కల్పించడంతోపాటు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ సహాయక బృందాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. ప్రమాదకర రహదారులు, వంతెనలు, వాగుల వద్ద రాకపోకలను నియంత్రించాలన్నారు. వ్యవసాయ, ఉద్యానవన పంటల రక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. కోతకు సిద్ధంగా ఉన్న వరి పంటలు, కల్లాల్లోని ధాన్యాన్ని సురక్షితంగా భద్రపరచాలని, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా టార్పాలిన్లు, గోదాములు అందుబాటులో ఉంచాలన్నారు. వరి, మొక్కజొన్న, పత్తి, అపరాల పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. అరటి, బొప్పాయి, కొబ్బరి, ఆయిల్‌పామ్, మామిడి తోటలకు గాలుల ప్రభావంతో నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు చేపట్టాలన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ముందస్తు హెచ్చరికలు అందించాలని ఆదేశించారు.

పశువులను ముంపు ప్రాంతాల నుంచి తరలించి పశుగ్రాసం, మందులు, పశువైద్య బృందాలను సిద్ధంగా ఉంచాలని మంత్రి సూచించారు. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని, చేపలు, రొయ్యల చెరువుల గట్లను పరిశీలించి ఆక్వా రైతులను అప్రమత్తం చేయాలన్నారు. శ్రీకాకుళంలో వంశధార, నాగావళి పరివాహక ప్రాంతాలు, పార్వతీపురం మన్యంలో కొండ ప్రాంతాలు, గిరిజన గ్రామాలు, కోనసీమలో గోదావరి డెల్టా, తీరప్రాంతాలు, ఆక్వా చెరువులపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. మంగళవారం అన్ని ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని, తుఫాను తీవ్రత సమయంలో ప్రజలు అనవసరంగా బయటకు రాకుండా చూడాలని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. తుఫాను తగ్గిన వెంటనే గ్రామాలవారీగా పంట, ఆస్తినష్టం అంచనాలు ప్రారంభించి సహాయక చర్యలను వేగవంతం చేయాలన్నారు. కలెక్టర్లు క్షేత్రస్థాయి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన నిధులు, సిబ్బంది, పరికరాల వివరాలను ప్రభుత్వానికి తెలియజేయాలని ఆదేశించారు.

# ముందస్తు చర్యల్లో నిర్లక్ష్యం వద్దు

(మొదటి పేజీ తరువాయి)

ముందస్తు చర్యలు, ప్రజల భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కలెక్టర్లతో సమీక్షించారు. తుపాను ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. తీర ప్రాంత గ్రామాల ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయడంతో పాటు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో అవసరమైన సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని హోంమంత్రి సూచించారు. బలమైన గాలుల కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున రహదారులు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లోని హోర్డింగ్స్‌ను వెంటనే తొలగించాలని స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో సహాయక చర్యలు వేగంగా చేపట్టేలా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. తుపాను సమయంలో ప్రజలకు సరైన సమాచారం చేరవేయడం అత్యంత ముఖ్యమని అనిత పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే నిర్ధారణలేని వార్తలు, వదంతులను ప్రజలు నమ్మవద్దని సూచించారు. ప్రభుత్వం, సంబంధిత శాఖలు జారీ చేసే అధికారిక సూచనలు, ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. తుపానును ఎదుర్కొనేందుకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉందని, ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించడమే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పరిస్థితులకు అనుగుణంగా ముందస్తు చర్యలు తీసుకోవాలని హోంమంత్రి ఆదేశించారు.

## గ్రామకంఠం భూమి కాదు అది పట్టా భూమి

# మహేశ్వరం పేరేడు 1, 2 భూములు పట్టా భూములే!

- గ్రామకంఠం కాదు.. ప్రభుత్వ భూమి కాదు.. దేవాలయ భూమి కూడా కాదు
- కాంగ్రెస్ పార్టీ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారు సర్పంచ్ నవీన్, కర్రోళ్ల చంద్రయ్య ముదిరాజ్
- పేరేడు 1,2 లో ఉన్న భూమి 60 కోట్లు అనేది ఒక బోగస్!
- లేనిపోని మాటలు చెప్పి ప్రజలను ఇబ్బందికి గురిచేస్తున్నారు



**మహేశ్వరం, అక్టోబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** మహేశ్వరం పరిధిలోని పేరేడు 1, 2లో ఉన్న 4.06 గుంటల భూమి గ్రామకంఠం, ప్రభుత్వ భూమి కాదని, అది పట్టా భూమి అని గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కర్రోళ్ల చంద్రయ్య స్పష్టం చేశారు. ఈ భూమికి సంబంధించి 1950 నుంచి ఉన్న పత్రాలు, గతంలో జరిగిన ఒప్పందాలు, న్యాయస్థానంలో జరిగిన విచారణ వివరాలను వారు ప్రస్తావించారు. భూమిపై వాస్తవాలను నిర్ధారించేందుకు రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించాలని కోరారు.

**1950 నుంచి పట్టా భూమిగానే నమోదు!**

గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్ మాట్లాడుతూ.. పేరేడు 1, 2లోని భూమి పట్టా భూమి అని, గ్రామకంఠం లేదా ప్రభుత్వ భూమి కాదని తెలిపారు. అప్పటి దేవాలయ కమిటీతో కుదిరిన ఒప్పందం ప్రకారమే భూమికి సంబంధించిన అమ్మకాలు, కొనుగోళ్లు జరిగాయని పేర్కొన్నారు. ఈ భూమిపై సర్వే నిర్వహించాలని కోరుతూ పది రోజుల క్రితమే మహేశ్వరం తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించినట్లు వెల్లడించారు. ఇదే లేఅవుట్‌లో 2004లో తన భార్య పేరుతో ప్లాటు కొనుగోలు చేసినట్లు తెలిపారు.

**1991లో లేఅవుట్.. 1998లో కోర్టు తీర్పు**

బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కర్రోళ్ల చంద్రయ్య మాట్లాడుతూ.. పేరేడు 1, 2లోని భూమి 1950 నుంచి పట్టా భూమిగానే పత్రాల్లో నమోదై ఉందని పేర్కొన్నారు. 1991లో - సయ్యద్ అసునుద్దిన్ ఆధ్వర్యంలో లేఅవుట్ ఏర్పాటు చేసినట్లు, అదే ఏడాది గ్రామపంచాయతీ నుంచి ఎన్‌వోసీ వచ్చినట్లు తెలిపారు.1992లో లేఅవుట్‌కు సంబంధించి కోర్టులో కేసు నమోదైందని, 1998లో ఇబ్రహీంపట్నం కోర్టులో తమ వాదనకు అనుకూలంగా తీర్పు వచ్చిందని చెప్పారు.దేవాలయ భూమి అని నిరూపించేందుకు సరైన ఆధారాలు లేవని కోర్టు ఆదేశాల్లో పేర్కొన్నట్లు వివరించారు. పేరేడు 1,2 కి సంబంధించి సాగత్, సల్మాన్, అప్నన్ పట్టదారులుగా ఉన్నారు.

**దేవస్థానం కమిటీతో ఒప్పందం**

2002లో శివగంగా రాజరాజేశ్వరి దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో లేఅవుట్‌లో ప్లాట్ల అమ్మకాలు, కొనుగోళ్లకు సంబంధించి ఒప్పందం జరిగినట్లు చంద్రయ్య తెలిపారు. అప్పటి సర్పంచ్ కూన యాదయ్య, దేవస్థానం చైర్మన్ కాకి ఈశ్వర్ ఈ స్థలం గ్రామకంఠం, దేవాలయ భూమి కాదనే విషయంపై ఒప్పంద పత్రం ఇచ్చినట్లు పేర్కొన్నారు. పేరేడు 1, 2 భూములకు సంబంధించి టెనెంట్‌దారులుగా దోమ ఎల్లారెడ్డి మరియు బజార్ (చాకలి) జంగయ్య పేరు ఉందని, 38-ఊ పత్రం కూడా ఆయన పేరుతో ఉందని తెలిపారు. 1996లో జంగయ్య తన టెనెన్సీ హక్కులను అసునుద్దిన్‌కు సరెండర్ చేసినట్లు వివరించారు.

**72 మంది పట్టాదారులు ఉన్నారని వెల్లడి**

ఈ లేఅవుట్‌లో ప్రస్తుతం 72 మంది పట్టాదారులు ఉన్నారని, తాను 2003లో ప్లాట్లు కొనుగోలు చేసినట్లు చంద్రయ్య తెలిపారు.అప్పటి మార్కెట్ విలువ ప్రకారమే ప్లాట్ల కొనుగోళ్లు జరిగాయని, తక్కువ ధరలకు భూములు కొనుగోలు చేశారనే ఆరోపణలు అవాస్తవమని అన్నారు.72 మంది ప్లాట్లు కొన్న పట్టదారులు విలేకరుల సమావేశంలో తమ సమస్యలను వెల్లడించారు. అలాగే 2013లో రఘునందన్ రావు తహశీల్దార్ ఆర్డర్ ఇచ్చిన విషయాన్ని కూడా ప్రస్తావించారు.

లిఅధికారుల సర్వేతో వాస్తవాలు వెలుగులోకి రావాలిలి

పేరేడు 1, 2 భూములపై స్థానికంగా రాజకీయ కారణాలతో తప్పుడు ఆరోపణలు, అసత్య ప్రచారాలు జరుగుతున్నాయని చంద్రయ్య విమర్శించారు.భూమికి సంబంధించిన పాత పత్రాలు, రెవెన్యూ రికార్డులు, కోర్టు ఉత్తర్వులు, ఒప్పంద పత్రాలను పరిశీలించి అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరారు. భూమి స్వరూపం, హక్కులపై నెలకొన్న వివాదానికి అధికారిక రికార్డుల పరిశీలనతో తెరపడాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇసాక్ అలీ, పాండు రంగయ్య,

శంకర్ యాదయ్య , కానాపురం సింహాచలం సాగర్,ఒగ్గు మల్లేష్, ప్లాట్ ల యజమానులు, మహేశ్వరం గ్రామ ప్రజలు, తదిదరులు పాల్గొన్నారు.

# జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ తొలగింపు కోసం...ఎమ్మార్పీఎస్ మద్దతు

- మంగళవారం రోజున మొదలు పెట్టబోతున్న పాదయాత్రకు మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్ సంపూర్ణ మద్దతు.
- డంపింగ్ యార్డు తొలిగించాలని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ పాదయాత్ర మొదలు.
- జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ కాలుష్య సమస్యను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలి.



**మేడిపల్లి: అక్టోబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** మేడిపల్లి మండల కేంద్రం తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ తొలగింపు కోసం సంబంధించిన కరపత్రంను, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జ్ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే శ్రీ ఏనుగు సుదర్శన్ రెడ్డితో కలిసి కరపత్రాన్ని ఆవిష్కారించిన ఎమ్మార్పీఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పంగ ప్రణయ్ మాదిగ.

జవహర్ నగర్ డంపింగ్ యార్డును తొలగించాలని మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ రేపు మంగళవారం రోజున మొదలు పెట్టబోతున్న పాదయాత్రకు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

**ఈ సందర్భంగా జిల్లా ఎమ్మార్పీఎస్ నాయకులు పంగ ప్రణయ్ మాట్లాడుతూ...**

జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ కారణంగా పరిసర ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న దుర్వాసన, గాలి కాలుష్యం, భూగర్భ జలాలు మరియు చెరువుల కాలుష్యంపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని

మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి తరపున డిమాండ్ చేసారు .హైదరాబాద్ నగర చెత్త నిర్వహణ పేరుతో స్థానిక ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ నిర్లక్ష్యానికి గురికాకూడదు. డంపింగ్ యార్డ్ పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు, చెరువుల నీటి నాణ్యతపై శాస్త్రీయ పరీక్షలు నిర్వహించి, నివేదికలను ప్రజలకు వెల్లడించాలి. కాలుష్య నియంత్రణకు శాశ్వత చర్యలు చేపట్టాలి. పాత చెత్తను శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహించి, ప్రజలకు స్వచ్ఛమైన గాలి, సురక్షితమైన తాగునీరు అందించాలి.ప్రభుత్వం తక్షణమే సంబంధిత శాఖలతో సంయుక్త తనిఖీలు నిర్వహించి, బాధిత ప్రజల సమస్యల పరిష్కారానికి కాలపరిమితితో కూడిన కార్యాచరణ ప్రకటించాలి.

ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ ప్రభుత్వ బాధ్యత. ప్రజల ప్రాణాలు, ఆరోగ్యంతో రాజీ పడకుండా జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలనిప్రజల పక్షాన పాదయాత్ర చెయ్యబోతున్న మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ గారికీ సంపూర్ణ మద్దతు తెలుపుతూ రేపటి పాదయాత్రలో భాగస్వామ్యం అవుతామని తెలియచేసారు సీనియర్ జిల్లా నాయకులూ బండారి సాయి మాదిగ,ఘట్కేసర్ మండల అధ్యక్షులు గుండె ఉపేందర్ , అధికార ప్రతినిధి వినోద్ , ఉపాధ్యక్షులు జమ్మిగారి గణేష్ ,ఘట్కేసర్ డివిజన్ అధ్యక్షులు కడుపోళ్ల కరుణాకర్, మేడిపల్లి మండలం బీజేపీ అధ్యక్షులు జమ్ముల ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆలయ నిధుల అవతవకల నిగ్గు తేల్చాలి

- శ్రీ పహాడి హనుమాన్ దేవాలయ అభివృద్ధి మరియు పరిరక్షణ కమిటీ డిమాండ్
- గత పాలక మండలి హయాంలో అనేక అవతవకల జరిగాయి
- మే నెలలోనే దేవాదాయశాఖ అధికారులకు ఫిర్యాదు
- ఇప్పటి వరకు ఎటువంటి పురోగతి లేదు
- అభివృద్ధి కమిటీ 2012లో ఏర్పాటు అయ్యింది
- ఆలయాన్ని అనేక విధాలుగా అభివృద్ధి చేసాము
- నేటితో ఈ కమిటీ రద్దు చేస్తున్నాము
- ప్రధాన కార్యదర్శి నక్క మధుసూదన్ రావు వెల్లడి



**అడ్డగుట్ట, అక్టోబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** గత పాలక మండలి హయాంలో శ్రీ పహాడి హనుమాన్ దేవాలయంలో అనేక అవకతవకలు జరిగాయని శ్రీ పహాడి హనుమాన్ దేవాలయ అభివృద్ధి మరియు పరిరక్షణ కమిటీ ప్రధాన కార్యదర్శి నక్క మధు సుధన్ రావు ఆరోపించారు. తుకారాం గేట్ లోని శ్రీ పహాడి హనుమాన్ దేవాలయ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో అభివృద్ధి కమిటీ సభ్యులతో కలిసి నక్క మధు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కోసం దాతలు ఇచ్చిన నిధుల దుర్వినియోగం జరిగిందని దేవాదాయ శాఖ కమీషనర్, డిప్యూటీ, అసిస్టెంట్ కమిషనర్లతో పాటు విజిలెన్స్ అధికారులకు కూడా గత మే నెలలోనే పిర్యాదు చేసినట్లు తెలిపారు. దేవాలయ ప్రతిష్టకు, భక్తుల మనోభావాలకు కూడా భంగం కలుగవద్దని ఉద్దేశ్యంతో తో అంతర్గతంగానే విచారణ జరిపి చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆశించినట్లు పేర్కొన్నారు. కానీ అధికారులు అలసత్వం వహిస్తూ ఎటువంటి చర్యలు తీసుకోకుండా కాల యాపన చేయడం శోచనీయం అని అన్నారు. గతంలో అవకత వకలకు పాల్పడిన వారే మళ్లీ కొత్త పాలకమండలిలో అవకాశం కల్పించాలని దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసిందని తప్పని సరి పరిస్థితుల్లోనే ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గత పాలకమండలి హయాంలో చైర్మన్ ఎం లక్ష్మణ్ ప్రసాద్ ఆధ్వ ర్యంలో సభ్యులు అనేకమంది దాతల నుండి నిధులు సేకరిం చడం జరిగిందని, అందులో కొంతమంది వస్తూ రూపంలో విరాళాలు ఇవ్వగా అధిక శాతం మంది నగదు రూపంలోనే విరాళాలు ఇవ్వడం జరిగిందని చెప్పారు. నిబంధనల మేరకు దేవాలయానికి సంబంధించిన లావాదేవీల వ్యవహారాలు ఆలయ ఈఓ సమక్షంలోనే జరగాలి, వాటికి రసీదులు కూడా ఇవ్వాలి కానీ వీటికి పూర్తి విరుద్ధంగా గత పాలకమండలి వ్యవహరిం చిందని పేర్కొన్నారు. లక్షల్లో విరాళాలు ఇచ్చిన దాతలకు రసీదులు ఇవ్వక పోవడమే కాకుండా ఆలయ ఆవరణలో దాతల పేర్లతో ఏర్పాటు చేసిన శిలాపాలకం పైన కూడా వారు ఇచ్చిన విరాళాల వివరాలు పొందపరచలేదని చెప్పారు. పైగా ఈ శిలా పలకంపైన దాతల పేర్లు, పాలకమండలి సభ్యుల పేర్లతో పాటు ఉండాల్సిన ప్రభుత్వ ప్రతినిధులైన ఆలయ ఈఓ, పురోహితుడి పేర్లు లేక పోగా ఆలయానికి ఎటువంటి సంబంధం లేని ప్రభుత్వం నియమించిన కమిటీకి ఒక అడ్వైజర్ ను నియమిం చుకొని అతడి పేరు కూడా శిలాపలకంపైన నమోదు చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ శిలాపలకంపైన కూడా కేవలం 20మంది దాతల పేర్లు మాత్రమే నమోదు అయ్యాయని, విరాలమిచ్చి శిలాపలకం పైన చోటు లభించని వారు ఇంకా చాలా మంది ఉన్నారనే విషయం తమ దృష్టికి వచ్చిందని వివరించారు. ఇప్పటికైన స్పందించి సమగ్ర విచారణ జరిపి నిజానిజాలను బహిర్గతం చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. తద్వారా భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా రాబోయే రోజుల్లో స్వామివారికి ఇచ్చే విరాళాలు సక్రమంగా దేవాలయఅభివృద్ధికే వినియోగించపడతాయనే నమ్మకం కల్పించాల్సిన బాధ్యత ఉందని స్పష్టం చేశారు.

**అభివృద్ధి కమిటీ చరిత్ర**

దేవాలయ అభివృద్ధి కమిటీ 2012 లో ఏర్పాటు చేయడం జరిగిందని, ఆలయ పరిరక్షణతో పాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని వివరించారు. అప్పటినుండి కూడా ఆలయ సేవకులుగానే ఉన్నామని, ఆలయ అభివృద్ధిలో తాము కూడా భాగస్వాములు అవుతామని అనేక మంది ఆసక్తి చూపుతున్నారని కొత్త వారికి కూడా అవకాశం కల్పించాలనే ఉద్దేశ్యంతో ఈ కమిటీని రద్దు చేస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే యువకులకు ప్రాధాన్యత నిస్తూ కొత్త కమిటీ ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

**ఆలయ చరిత్ర:** ఈ సందర్భంగా మాజీ చైర్మన్ శ్రీ రాములు మాట్లాడుతూ 1827లో వెలసిన స్వయంభూ హనుమాను దేవాలయం ఇది అని తెలిపారు. గుట్టపైన ఆలయం ఉండడంతో ఇది పహాడి హనుమాను దేవాలయంగా గుర్తింపు పొందడం జరిగిందని పేర్కొన్నారు. జంట నగరాలలోనే ఇటువంటి ఆలయం లేదంటే అతిశయోక్తి కాదన్నారు. ఇక్కడి ఆలయ పరిసర ప్రాంతాల్లో అడుగు పెడితే అడవి ప్రాంతంలో ఉన్న అనుభూతి కలుగుతుందని చెప్పారు. ఇప్పటికి కార్తీక మాసంలో దూరప్రాంతాల్లోని వ్యక్తులు స్వాములు, కుటుం సభ్యులతో కలసి ఇక్కడికి వచ్చి స్వామి దర్శనం చేసుకోవడంతో పాటు ఇక్కడే సేద తిరుతుంటారని తెలిపారు. వచ్చే సంవత్సరం నాటికి రెండు శతాబ్దాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయడంతో పాటు ఘనంగా బ్రహ్మోత్సవాలు నిర్వహించాలని బావిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో ఆలయ అభివృద్ధి పరిరక్షణ కమిటీ సభ్యులు ఆర్ మల్లేష్, జీ నర్సింగ్ రావు, శివ కుమార్, వెంకటేష్ గౌడ్, పీ విజయ్ కుమార్, రమేష్ బాబు, ప్రవీణ్ పాల్గొన్నారు.

# కిష్టాపూర్‌లో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమం...!

**మేడ్చల్, అక్టోబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** మేడ్చల్ సర్కిల్ పరిధిలోని పూడూరు--కిష్టాపూర్ డివిజన్‌లో భాగమైన కిష్టాపూర్ గ్రామంలో మాజీ కౌన్సిలర్ తుడుం గణేష్ ఆధ్వర్యంలో పట్ట భద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ఎంతో కీలకమని, అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకొని తమ హక్కును వినియోగించుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.ఈ కార్యక్రమంలో భాగంగా డిగ్రీ, పీజీ తదితర ఉన్నత విద్యను పూర్తి చేసిన పట్టభద్రులకు ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించు కోవాలంటే అర్హులైన పట్టభద్రులు ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవడం ముఖ్యమని వివరించారు. గ్రామంలోని అర్హులైన ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు.ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో పట్టభద్రుల పాత్ర కీలకమని, విద్యావంతులు తమ ఓటు హక్కుపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. గ్రామంలోని అర్హులైన పట్టభద్రులందరూ ఈ అవ కాశాన్ని సద్వినియోగం చేసుకొని ఓటరుగా నమోదు చేసు కోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయ కులు డి. నరేష్, మంత్రి కుమార్, డి. సురేష్, సూరిబాబు, సాయి గౌడ్, సుధాకర్, గ్రామస్తులు గణేష్,విష్ణు పాల్గొన్నారు.

## మహేశ్వరం మంచినీటి ట్యాంకుల స్థలం

# గ్రామపంచాయతిది కాదా ? మరి ఎవరిది ?

- మహేశ్వరం వాటర్ ట్యాంకుల స్థలాన్ని కాపాడాలి - బీజేపీ డిమాండ్



**మహేశ్వరం, అక్టోబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** మహేశ్వరం గ్రామంలోని ప్రజల మంచినీటి వాటర్ ట్యాంకుల స్థలానికి సంబంధించిన వివాదాన్ని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, బీజేపీ మహేశ్వరం గ్రామ శాఖ ఆధ్వర్యంలో ప్రజావాణిలో నిరసన తెలియజేశారు.

గత మూడు నెలలుగా కొనసాగుతున్న ఈ వివాదంపై బీజేపీ ఇచ్చిన ఫిర్యాదుకు 15 రోజులుగా స్పందన లేకపోవడంతో నిరసన చేపట్టారు. వాటర్ ట్యాంకుల స్థలానికి సంబంధించిన ప్రహరీ గోడపై కబ్రస్తాన్ అని రాసిన వారిని గుర్తించి, వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామ ప్రజలకు తాగునీరు అందించే వాటర్ ట్యాంకులను, వాటి స్థలాన్ని కాపాడాల్సిన బాధ్యత గ్రామ సర్పంచ్‌పై కూడా ఉందని, ఈ విషయంలో సర్పంచ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు.సర్వే నంబర్ 336కు సంబంధించిన పత్రాలు, హద్దులను పరిశీలించి సమస్యను చట్టప్రకారం పరిష్కరించాలని అధికారులను కోరగా, ఎంఆర్ఓ గారు రేపటిలోపు సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

ఈ కార్యక్రమం బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి వనంపల్లి శ్రవణ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర గిరిజన మోర్చా కార్యదర్శి పాండు నాయక్, సీనియర్ నాయకులు తింగరికారి నాగేశ్వర్ ప్రకాష్, ఆదిల్ల కుశలయ్య, మండల కార్యదర్శి మహేందర్, కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు చిందం జంగయ్య, రామోజీ, బొమ్మని జంగయ్య, శ్రీశైలం యాదవ్, దూసకంటి సాయినాథ్, భూత్ అధ్యక్షుడు దూసకంటి గణేష్, గాజుల శేఖర్, భీమనపల్లి రాజేష్, సందుల గణేష్ తదితరులు పాల్గొన్నారు.గ్రామ ప్రజల మంచినీటి ట్యాంకుల స్థలంతో పాటు గ్రామానికి చెందిన ఆస్తులను పరిరక్షించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు.

# బీజేపీ నేతలకు పదవులు... నియామక పత్రాలు



**రాంగోపాల్ పేట్, అక్టోబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** బీజేపీ నేతలు పార్టీకి అందించిన సేవలకు గుర్తింపుకు గాను సికింద్రాబాద్ మహంకాళి జిల్లాలో నూతన పదవుల నియామకాలు చేపట్టారు . ఈ సందర్భంగా సోమవారం బీజేపీ జిల్లా అధ్యక్షులు గుండుగోని భరత్ గౌడ్ ,చీర రాష్ట్ర ఓబిసి మోర్చా మాజీ ఉపాధ్యక్షులు చీర శ్రీకాంత్ చేతులమీదుగా రాంగోపాల్ పేట్ డివిజన్ నాయకులకు నూతన పదవీ బాధ్యతల నియామక పత్రాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.నూతన పదవీ బాధ్యతలు అందుకున్న వారిలో జిల్లా కార్యవర్గ సభ్యుడిగా పులి మదన్,ఎస్.వి.నరేష్,ఎస్సీ మోర్చా సనత్ నగర్ నియోజకవర్గం సమన్వయకర్తగా అనంత శ్రీనివాస్,సీనియర్ సిటిజన్ కో కన్వీనర్‌గా గోపి కిషన్ ఉపాధ్యాయలకు నియామక పత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు విషయంలో

# రాష్ట్ర ప్రభుత్వం,ఎన్నికల కమిషన్‌ల నిర్లక్ష్యం

## - ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



**కంటోన్మెంట్, అక్టోబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కార్యక్రమం విషయంలో ఎన్నికల కమిషన్, రాష్ట్ర ప్రభుత్వం తమకేం సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నాయని మాజీమంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆరోపించారు .సోమవారం వెస్ట్ మారేడ్ పల్లి లోని క్యాంప్ కార్యాలయం వద్ద సనత్ నగర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ సర్వసభ్య సమావేశం జరిగింది.అనంతరం మీడియా తో మాట్లాడుతూ నవంబర్ 6 వ తేదీన గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కార్యక్రమం ముగుస్తుందని,దీనిని దృష్టిలో ఉంచుకుని కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని పార్టీ శ్రేణులను కోరారు. కాలనీలు, బస్తీలు, అపార్ట్ మెంట్ లలో పాదయాత్రగా తిరుగుతూ ఇంటింటికీ వెళ్ళి అర్హులైన గ్రాడ్యుయేట్ లను గుర్తించి ఓటరుగా నమోదు చేయించాలని పిలుపునిచ్చారు. ఓటరు నమోదు కార్యక్రమం బాధ్యత ఎన్నికల కమిషన్ పై ఉన్నప్పటికీ పట్టించుకోని కారణంగా బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బి ఎల్ ఓ లను కూడా నియమించలేదని మండిపడ్డారు. గత గ్రాడ్యుయేట్ ఎన్నికలలో హైదరాబాద్ నగర పరిధిలో ఒక లక్ష 10 వేల మంది గ్రాడ్యుయేట్ లు ఓటర్లుగా నమోదు కాగా, ప్రస్తుతం ఇప్పటి వరకు 23 వేల దరఖాస్తులు మాత్రమే వచ్చాయని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ పూర్తిగా విఫలమైందని విమర్శించారు. గ్రాడ్యుయేట్ ల నుండి ఓటరు నమోదు పత్రాలు స్వీకరించి అధికారులకు అందజేస్తే అధికారులు అడ్డంకులు సృష్టిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం కూడా ఏ మాత్రం బాధ్యతగా వ్యవహరించడం లేదని ధ్వజమెత్తారు. ప్రభుత్వ అసమర్ధ పాలన వలన ప్రజలు అనేక సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్య మంత్రి పాలనను గాలికొదిలి రాష్ట్రాల పర్యటన లు చేస్తున్నారని విమర్శించారు.ఈ సమావేశంలో ఓటరు నమోదు కార్యక్రమం నియోజకవర్గ ఇంచార్జి గోసుల శ్రీనివాస్ యాదవ్,మాజీ కార్పొరేటర్ లు నామన శేషుకుమారి,టి. మహేశ్వరి,అత్తిలి అరుణ గౌడ్, కుర్మ హేమలత, డివిజన్ అధ్యక్షులు కొలన్ బాల్ రెడ్డి, గుర్రం పవన్ కుమార్ గౌడ్, అత్తిలి శ్రీనివాస్ గౌడ్, హన్మంతరావు, వెంకటేషన్ రాజు, శ్రీనివాస్ గౌడ్, నాయకులు గందే నాగులు, టి. శ్రీహరి, ప్రవీణ్ రెడ్డి, నరేందర్, లక్ష్మీపతి, ఏసూరి మహేష్, కరుణాకర్ రెడ్డి, కొండాపురం మహేష్ యాదవ్, అశోక్ యాదవ్, మల్లారెడ్డి, ప్రేమ్, అబ్బాస్, గుడిగే శ్రీనివాస్ యాదవ్, ఆరీఫ్ పాల్గొన్నారు.

# ప్రజావాణికి 55 ఫిర్యాదులు



**శేర్లింగంపల్లి, అక్టోబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 55 ఫిర్యాదులు అందాయి. వీటిలో అత్యధికంగా టౌన్‌ప్లానింగ్ విభాగానికి 42 ఫిర్యాదులు వచ్చాయి.ఇంజినీరింగ్ విభాగానికి 5, రెవెన్యూ (ఆస్తిపన్ను), పారిశుధ్య విభాగాలకు రెండేసి, వెటర్నరీ, భూసేకరణ, అర్బన్ బయో డైవర్సిటీ, అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ విభాగాలకు ఒక్కో ఫిర్యాదు అందింది. ఫిర్యాదులన్నింటినీ ప్రత్యేక గుర్తింపు సంఖ్యలతో నమోదు చేసి, వాటి పరిష్కార పురోగతిని తెలుసుకునేందుకు ట్రాకింగ్ లింకులను అందుబాటులో ఉంచారు. ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను అధికారులు ఆదేశించారు.

# పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల సన్నాహక సమావేశం

- బోనకల్ మండలంలో పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

**బోనకల్, అక్టోబరు 27**



**(జర్నలిస్ట్ ఫైల్) :** మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కర్నాటి రామ కోటేశ ్వర రావు ఆధ్వర్యంలో పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, మధిర నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి పోట్ల నాగేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా పోట్ల నాగేశ్వర రావు మాట్లాడుతూ శాసనమండలి ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లోని పార్టీ బాధ్యులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పట్టభద్రులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించేందుకు ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. గ్రామ శాఖ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సర్పంచులు, ముఖ్య నాయకులు సమన్వయంతో పనిచేసి మల్లు భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో అత్యధిక ఓట్లు సాధించేలా కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు.జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ మాట్లాడుతూ బోనకల్ మండలంలో అత్యధిక సంఖ్యలో పట్టభద్రుల ఓట్లు నమోదు చేయించి, నియోజకవర్గంలో మండలాన్ని మొదటి స్థానంలో నిలపాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీకి విధేయుడిగా ఉన్న రామిరెడ్డి వారసుడు సర్వోత్తమ రెడ్డికి అందరూ మద్దతుగా నిలవాలని కోరారు. ఎన్నినో అంశంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తిప్పికొట్టాలని అన్నారు.ఈ సమావేశంలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వెంజండ్ల సాయికుమార్, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మాజీ సభ్యుడు పైడిపల్లి కిశోర్ కుమార్, మండల ఎన్నికల ఇన్‌చార్జులు యర్రంశెట్టి సుబ్బారావు, కందుల పాపారావు, మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# వైరా—మధిర ఆటో అడ్డా యూనియన్ అధ్యక్షుడిగా రెండోసారి నాగటి బాబు ఏకగ్రీవ ఎన్నిక

- ఆటో డ్రైవర్లకు రూ.12 వేల ఆర్థిక సాయం అందించాలి : సీఐటీయూ మండల కన్వీనర్ గుగులోతు నరేష్

**బోనకల్, అక్టోబరు 27**



**(జర్నలిస్ట్ ఫైల్) :** మండల కేంద్రంలో వైరా నుంచి మధిరకు వెళ్లే ఆటోల యూనియన్ ఎన్నికలు సోమవారం సీఐటీయూ బోనకల్ మండల కన్వీనర్ గుగులోతు నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ఎన్నికల్లో యూనియన్ అధ్యక్షుడిగా నాగటి బాబును రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు నాగటి బాబును గుగులోతు నరేష్ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం వెంటనే రూ.12 వేల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. రాజకీయాలకు అతీతంగా ఆటో డ్రైవర్లకు ఇందిరమ్మ ఇళ్లు, ప్రభుత్వ స్థలాలు కేటాయించాలని కోరారు. ఆటో డ్రైవర్లకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని అన్నారు.యూనియన్ నూతన కార్యవర్గంలో ఉపాధ్యక్షుడిగా కర్లకుంట కిరణ్, కార్యదర్శిగా బాణాల బసవయ్య, కోశాధికారిగా పంచర్ల జయరాం, నిర్వాహకుడిగా గొర్రెముచ్చ నేలయ్య ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమంలో తెలకపల్లి వీరయ్య, ఎస్‌కే సైదా, మేడ నాగరాజు, తాళ్లూరి సుధాకర్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ లో ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి

**నిజామాబాద్**



**(జర్నలిస్ట్ ఫైల్) :** ఆదికవి మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను సోమవారం ఘ న ంగా నిర్వహించారు.జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(కలెక్టరేట్)లో అధికారికంగా నిర్వహించిన వాల్మీకి జయంతి వేడుకలకు కలెక్టర్ ఇలా త్రిపాఠి ముఖ్య అతిథిగా విచ్చేశారు.మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం,జ్యోతి ప్రజ్వలన చేసి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ....మహర్షి వాల్మీకి రచించిన రామాయణం భారతీయ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిందన్నారు.సమాజంలో సత్ప్రవర్తన,సమానత్వం,సోదరభావం పెంపొందించేందుకు వాల్మీకి బోధనలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు.మహర్షి వాల్మీకి చూపిన మార్గంలో నడుస్తూ సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ భుజంగరావు,జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి సాయికుమార్,వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షుడు నరేష్,బీసీ సంఘాల నాయకులు బుస్స ఆంజనేయులు,రాజేశ్వర్,బస్సాపూర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# రంగారెడ్డి జిల్లా క్రికెట్ జట్టుకు తాటిగూడెం యువతి " దేవి ప్రియ" ఎంపిక

- హర్షం వ్యక్తం చేసిన మండల ప్రజలు





**కరకగూడెం, అక్టోబరు27(జర్నలిస్ట్ ఫైల్) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, కరకగూడెం మండలం తాటిగూడెం గ్రామానికి చెందిన రామటెంకి దేవి ప్రియ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపికైంది. మేడ్చల్ క్రికెట్ ఆరైనా (ఎంసీఏ ) బెస్ట్ క్రికెట్ అకాడమీ ద్వారా శిక్షణ పొందుతున్న దేవి ప్రియ జిల్లా జట్టుకు ఎంపిక కావడంతో అకాడమీ నిర్వాహకులు, కోచ్‌లు హర్షం వ్యక్తం చేశారు.కోచ్‌లు ఇర్ఫాన్, బుచ్చిబాబు, వెంకట్‌ల మార్గదర్శకత్వంలో దేవి ప్రియ నిరంతరం కఠోర సాధన చేస్తూ, క్రమశిక్షణతో క్రికెట్‌లో తన నైపుణ్యాలను మెరుగుపరుచుకుంది. ఈ కృషి ఫలితంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జట్టుకు ఎంపిక కావడం కరకగూడెం మండలానికి, తాటిగూడెం గ్రామానికి, శిక్షణ అందించిన అకాడమీకి గర్వకారణంగా నిలిచింది.ఏజెన్సీ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారిణులను గుర్తించి, వారికి నాణ్యమైన శిక్షణ అందిస్తూ ఉన్నత స్థాయికి తీసుకెళ్లడంలో మేడ్చల్ క్రికెట్ అరైనా బెస్ట్ క్రికెట్ అకాడమీ చేస్తున్న కృషి అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. కోచ్‌ల శిక్షణ, మార్గదర్శకత్వం, ప్రోత్సాహం యువ క్రీడాకారుల ఎదుగుదలకు ఎంతగానో దోహదపడుతున్నాయని తెలిపారు.జిల్లా జట్టుకు ఎంపికైన దేవి ప్రియ రాబోయే పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి మరిన్ని విజయాలు సాధించాలని కోచ్‌లు ఆకాంక్షించారు. ఆమె ఎంపిక ఇతర యువ క్రీడాకారిణులకు స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు.దేవి ప్రియ తల్లిదండ్రులు రామటెంకి హనుమంతరావు, ఉమామహేశ్వరి అందించిన ప్రోత్సాహంతో పాటు కోచ్‌ల మార్గదర్శకత్వం ఆమె విజయానికి తోడ్పడ్డాయని పలువురు అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో దేవి ప్రియ క్రికెట్‌లో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి, జిల్లా, రాష్ట్ర స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలు, క్రీడాకారులు, గ్రామస్థులు హృదయపూర్వకంగా అభినందనలు తెలిపారు.

# పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్బంగా వాలీబాల్ పోటీలు నిర్వహించిన. ఎస్ ఐ రాజమౌళి

**ఇల్లందు, అక్టోబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) :**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం బోడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఎర్రయిగూడెం గ్రామంలో బోడు ఎస్ ఐ రాజమౌళి వాలీబాల్ పోటీలు నిర్వహించడం జరిగింది క్రీడాకారులకు వాలీబాల్ కిట్టు అందించారు యువత చదువు లో రాణించాలి అన్నారు ఆటల వలన శరీర దృఢం క్రమశిక్షణ ఆలోచన శక్తి మెరుగు అవుతారు అని అన్నారు యువత చెడు అలవాట్లకు అలవాటు పడకుండా ఉండాలి అని అన్నారు.ఎస్ ఐ వాలీబాల్ అడి యువత ను ఉత్తేజపరిచారు సైబర్ క్రైమ్ గురించి దిశా నిర్దేశించారు. తెలియని వాళ్ళు ఫోన్ చేసి మన బ్యాంకు వివరాలు అడిగినప్పుడు 1930 కి పోలీస్ వారికీ సంప్రదించాలి అని ఎస్ ఐ రాజమౌళి అన్నారు ఈ కార్యక్రమం లో పోలీస్ సిబ్బంది ఎర్రయిగూడెం సర్పంచ్ ఊకె రమేష్. ఉప సర్పంచ్ చింత ప్రసాద్ వార్డ్ మెంబర్లు యువకులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు

# ప్రజావాణిలో శిల్పా హిల్స్ నివాసితులతో కలిసి సమస్యలపై వినతిపత్రం సమర్పించిన గంగల రాధాకృష్ణ యాదవ్

**శేరిలింగంపల్లి, అక్టోబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) :**




ఇజ్జత్‌నగర్ డివిజన్ పరిధిలోని శిల్పా హిల్స్, హైటెక్స్ ప్రాంతాల నివాసితులు ఎదుర్కొంటున్న పలు మౌలిక సదుపాయాల సమస్యల పరిష్కారం కోసం, శిల్పా హిల్స్ నివాసితులతో కలిసి కాంటెస్టెడ్ కార్పొరేటర్ గంగల రాధాకృష్ణ యాదవ్ మాధాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బాలకృష్ణ ని ప్రజావాణి కార్యక్రమంలో కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యలను, ముఖ్యంగా మోండి కుంట చెరువు నుంచి ఇజ్జత్‌నగర్ బస్తీ వరకు రోడ్డు నంబర్ 2 మీదుగా ప్రవహిస్తున్న నాలా సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ నాలాను అనేక సంవత్సరాలుగా శుభ్రం చేయకపోవడంతో రోడ్డు నంబర్లు 2, 3, 4 ప్రాంతాల్లో తీవ్రమైన దుర్వాసన వ్యాపిస్తోందని, వెలువడుతున్న విషవాయువుల వల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు.అంతేకాకుండా, నాలాపై ఉన్న అనేక స్లాబులు పగిలిపోవడంతో నాలా నుంచి వెలువడుతున్న దుర్వాసన నేరుగా పరిసర ప్రాంతాలకు వ్యాపిస్తోందని తెలిపారు. ఈ పరిస్థితి ప్రజల ఆరోగ్యానికి, భద్రతకు ప్రమాదకరంగా మారుతోందని పేర్కొంటూ, నాలాను తక్షణమే శుభ్రం చేయడంతో పాటు పగిలిపోయిన స్లాబులను మార్చి, అవసరమైన మరమ్మతులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించాలని డిప్యూటీ కమిషనర్‌ను కోరారు.అదేవిధంగా, డ్రైనేజీ లీకేజీల నివారణ, రహదారుల మరమ్మతులు, వీధి దీపాల ఏర్పాటు, చెత్త తొలగింపు వంటి సమస్యలను కూడా వినతిపత్రంలో ప్రస్తావించారు.ప్రజల వినతిపై సానుకూలంగా స్పందించిన డిప్యూటీ కమిషనర్ బాలకృష్ణ, సంబంధిత అధికారులను సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఈ సందర్భంగా గంగల రాధాకృష్ణ యాదవ్ మాట్లాడుతూ, “ప్రజల ఆరోగ్యం, భద్రత, మెరుగైన మౌలిక సదుపాయాలు మా ప్రాధాన్యత. సంవత్సరాలుగా పరిష్కారం కాని సమస్యల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడటం బాధాకరం. ముఖ్యంగా నాలా శుభ్రపరిచే పనులు, పగిలిపోయిన స్లాబుల మార్పిడి విషయంలో అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలి. ప్రజల సమస్యలు పరిష్కారమయ్యే వరకు సంబంధిత అధికారులతో నిరంతరం సంప్రదిస్తూ ప్రజల పక్షాన కృషి చేస్తాం” అని తెలిపారు.ప్రజావాణిలో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, తక్షణ చర్యలకు ఆదేశించిన డిప్యూటీ కమిషనర్‌కు శిల్పా హిల్స్ నివాసితులు, కృతజ్ఞతలు తెలిపారు.వినతిపత్రం అందజేసిన వారిలో శిల్పా హిల్స్ కాలనీ వాసులైన వెంకట్ రెడ్డి, మురళి, శేషసాయి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు



**ఖమ్మం, అక్టోబరు 27(జర్నలిస్ట్ ఫైల్):** మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ రామానుజం మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ, మహర్షి వాల్మీకి జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని, ఆయన రచించిన రామాయణం చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. అదేవిధంగా ఆయన రచనలు మానవ జీవితంలో నైతిక విలువలు, కర్తవ్యనిష్ఠ, ధర్మబద్ధమైన జీవన విధానానికి మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఆయన బోధనలు సమాజంలో సత్యం, న్యాయం, ధర్మం, సమానత్వం వంటి విలువలను పెంపొందించేందుకు నేటికీ ప్రేరణగా నిలుస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కామరాజు, సెక్షన్ సూపరిండెంట్ శ్రీనివాస్ రావు, మినిస్ట్రీయల్ స్టాఫ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉద్యమకారుల అరెస్టులు ప్రజాస్వామ్యానికి మచ్చ

- హామీలు నెరవేర్చకుంటే ఉద్యమాలను ఉధృతం చేస్తాం : డా. కె.వి. కృష్ణారావు



**ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్):** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగాలకు సైతం వెనుకాడని ఉద్యమకారులను ముందస్తు అరెస్టులు చేయడం ప్రజాస్వామ్యానికి మచ్చని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి డా. కె.వి. కృష్ణారావు పేర్కొన్నారు . ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా అక్రమ అరెస్టులు, తప్పుడు కేసులతో భయభ్రాంతులకు గురిచేయడం వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని అన్నారు . ఎన్నికల ముందు ఉద్యమకారులకు ఇచ్చిన హామీలపై ఈ నెల 26వ తేదీలోపు ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కమిటీ డిమాండ్ పిలుపు మేరకు సీఎం ఇంటి ముట్టడి నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర మొత్తం మీద ఉద్యమకారులను పోలీసులు ఎక్కడికక్కడ హౌస్ అరెస్టులు , అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు . తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను తక్షణమే వేగవంతం చేసి , పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరారు . ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్రవ్యాప్తంగా రాస్తారోకోలు , ధర్నాలు , ఆందోళనలు చేపట్టి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు . ఈ కార్యక్రమంలో పగడాల నరేందర్ , లింగానబోయిన సతీష్ , డో కుపర్తి సుబ్బారావు , రెడ్డబోయిన వరలక్ష్మి , కామని అనంత లక్మి , స్వరూప రెడ్డి , కమలమ్మ , ధన లక్మీ , యాక లక్ష్మీ తదితరులు ఉన్నారు .

## పట్టభద్రుల శాసనమండలి పొత్తులకై సన్నాహాలు

**ఖమ్మం, అక్టోబరు 27(జర్నలిస్ట్ ఫైల్):** ఖమ్మం, వరంగల్, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ కోసం అధికార, ప్రతిపక్షాలు వారి వారి మిత్రపక్షాలతో సంప్రదింపులు చర్చలు జరుపుతున్నారు. అందులో భాగంగానే పట్టబదుల ఎమ్మెల్సీ ఎన్నికలకు జరిగే పోటీలలో కాంగ్రెస్ మిత్రపక్షమైన సిపిఐ తో రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. ఈసారి ఎమ్మెల్సీ ఎన్నికలలో సిపిఎం బరిలో దిగుతుందని ఆ పార్టీ వర్గం బహిరంగంగా ప్రకటనలు చేస్తుంది. సిపిఎం మిత్రపక్షమైన బిఆర్ఎస్ తమకు మద్దతు ఇవ్వమని తెలుపుతుందా లేదా సిపిఎం మద్దతిస్తుందా అనేది వారి సంప్రదింపులు చర్చలు వల్ల ఎవరికి సీటు వస్తుందో లేదా విడి విడిగా పోటీ చేస్తారు తెలియాల్సి ఉంటుంది. అలాగే బిజెపి ఈ రాష్ట్రంలో ఖమ్మం నల్గొండ వరంగల్ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఆంధ్ర రాష్ట్రం లాగానే జనసేన టిడిపి మద్దతుతో పోటీ చేస్తుందో లేదో తెలియాల్సి ఉంది. అలాగే ఇక్కడ టిడిపి క్యాడర్ కూడా ఉండటంతో తమ అధినాయకుడు ఆదేశాల మేరకు రంగంలో దిగాలని పిలుపునిస్తే దిగే అవకాశం ఉంది. బిజెపి సైతం గట్టి నాయకుడు ఎవరైనా ఉంటే వారికి మద్దతు ఇచ్చేందుకు సైతం ఆచితూచి అడుగులు వేస్తోంది. ఖమ్మంలో తోపాటు పట్టు ఉన్న సిపిఎంఎల్ పార్టీ తమ మద్దతు ఎవరికి ఇస్తుందో వేచి చూడాల్సిన అవసరం. మేధావులు విద్యార్థులు విద్యావంతులు ఉండటం వల్ల వారు కూడా ఎమ్మెల్సీ ఎన్నికలలో దిగుతారా లేదా అని దిగకపోతే ఎవరికి మద్దతిస్తారో చూడాల్సిన అవసరం. ముందుగా పొత్తుల విషయం తేల్చుకుంటే ఆయా పక్షాలు ప్రచారానికి సంసిద్ధం కావచ్చు. తద్వారా ఆయా పార్టీ లు పట్టబద్ధులను చేర్పించేందుకు ముందుకు రావచ్చు. ఇప్పటికే ఆ ప్రయత్నంలో ఉన్నారు. ఇంకా చేరని వారి పట్ల మిత్రపక్షాలు చేర్పించే పనిలో వేగవంతం చేయవచ్చు. ఖమ్మం జిల్లా నల్గొండ వరంగల్ జిల్లాలో వామపక్షాలు ప్రభావం కొంతమేరకు మిత్రపక్షాలకు లాభం చేకూర్చవచ్చు. అలాగే బిజెపి మొదటి నుంచి వరంగల్ నల్గొండ జిల్లాలలో బలంగానే ఉంది దానికి తోడు ఎవరైనా మద్దతిస్తే గట్టి పోటీ ఎదురు అవ్వవచ్చు. అలాగే టిఆర్ఎస్ సైతం చాలా బలియాంగా ఉంది. గట్టి పోటీని ఇచ్చే అవకాశం ఉంది. గెలుపు నిర్ణయించలేము. ప్రధాన పార్టీల నుంచి త్రిమికపోటీన చిత్తర్మకపాటిన అనేది నోటిఫికేషన్ వెలువడిన కూడా విత్ డ్రా చేసే వరకు చెప్పలేని పరిస్థితి. అలాగే ఇటీవల ఆవిర్భవించిన ఆధార్ పార్టీ, తీర్మనార్ మల్లన్న సైతం వారి అభ్యర్థులను బరిలోకి దింపుతారా లేదా వేచి చూడాల్సిన అంశం. ఏది ఏమైనా టిఆర్ఎస్ సైతం పూర్వ వైభవాన్ని సాధించుకునేందుకు కసరత్తు చేస్తుంది. బరిలో దిగిన అభ్యర్థుల ప్రతిపా, పాటవాలు అభ్యర్థుల అనుభవం సేవా తత్పరతం కలిగి ఉంటారా లేదా అని ఓటు వేసే అవకాశం కూడా లేక పోలేదు. ఓటర్లు విజ్ఞానవంతులు విద్యాధికులు అనుభవ సారాంశం కలిగిన వారు కావటంతో గెలుపు ఎవరిని వరిస్తుందో వేచి చూడాలి. ఖమ్మం వరంగల్ నల్గొండ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా జరుగుతాయి అనటంలో సందేహం లేదు. ఈ ఎన్నికలు అధికార పార్టీకి ప్రెస్టేజ్ అంశంగా చెప్పవచ్చు.

## ప్రతి దరఖాస్తును పరిశీలించి చర్యలు తీసుకోవాలి : స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ

- ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన అదనపు కలెక్టర్





**ఖమ్మం, అక్టోబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) :**
ప్రతి ఫిర్యాదు దరఖాస్తును పరిశీలించి చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రజల అర్జీలను స్వీకరించారు.వేంసూరు మండలానికి చెందిన డి.అపర్ణ తనకు దివ్యాంగుల పెన్షన్ వస్తుందని, తనకు బ్రతకడం చాలా కష్టంగా ఉందని మాల ఎస్సీ కులానికి చెందిన తాను ఇంటర్ ఉత్తీర్ణత సాధించానని, ఏదైనా ఉపాధి కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా ఉపాధి అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు.ఖమ్మం నగరానికి చెందిన మహమ్మద్ అబ్దుల్ కరీం తాను టీ హబ్ డయాగ్నస్టిక్ సెంటర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నందు ఔట్ సోర్సింగ్ లో ల్యాబ్ టెక్నీషియన్ గా విధులు నిర్వహించానని, జనవరి 2024 లో టర్మినేట్ చేశారని, తనకు ఉపాధి కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి పరిశీలించి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఖమ్మం నగరానికి చెందిన ఎస్.కే. నస్రీన్ తాను ట్రాన్స్ జెండర్ మహిళగా తనకు ఔట్సోర్సింగ్ ఉద్యోగం కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వ వైద కళాశాల ప్రిన్సిపాల్ కు రాస్తూ పరిశీలించి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఖమ్మం వైయస్సార్ కాలనీ కు చెందిన ఎం. రోజా తన భర్త తాగుతూ తనను హింసకు గురి చేస్తున్నారని తనకు రక్షణ కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా సంక్షేమ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు వెంటనే తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పోలేపల్లిలో భక్తిపారవశ్యం

- కన్నులపండువగా అయ్యప్ప 'మహా పడిపూజ'
- మారుమోగిన శరణుఘోష
- రామన్నపేట భక్త బృందం భజనలు భేష్





**ఖమ్మం, అక్టోబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) :**
ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లి గ్రామం శరణుఘోషతో మారుమోగింది. గ్రామానికి చెందిన కన్నె స్వామి దండగల వీరబాబు నివాసంలో శ్రీ అయ్యప్ప స్వామి వారి మహా పడిపూజ వేడుక అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధల నడుమ నిర్వహించబడింది.--- శాస్త్రోక్తంగా అభిషేకాలు గొలుసుల తిరుమల రావు గురుస్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్వామివారికి పాలు, తేనె, నెయ్యి, సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. పూజా పీఠాన్ని నానావిధ పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి పడిపూజను సోమవారం వైభవంగా జరిపారు.--- ఆకట్టుకున్న భక్తి భజనలు ఈ సందర్భంగా ఖమ్మం 60వ డివిజన్ రామన్నపేట అయ్యప్ప భక్త బృందం సభ్యులు ఆలపించిన భక్తి గీతాలు, మంగళ హారతులు భక్తులను విశేషంగా అలరించాయి. 'స్వామియే శరణం అయ్యప్ప' నినాదాలతో పరిసర ప్రాంతాలన్నీ ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.--- పెద్ద సంఖ్యలో పాల్గొన్న స్వాములు ఈ ఆధ్యాత్మిక మహోత్సవంలో గురుస్వాములు గరిడేపల్లి వెంకటేశ్వర్లు, చింతకాయల అంజయ్య, బరిగల శేఖర్, కట్ల నరసింహారావు, ఐతనబోయిన వెంకట్రావు, లక్ష్మణ్, కూచిపూడి మురళి, వీరబాబు, నాగరాజు, బండి మనోజ్, ఏటూకూరి నవీన్, తీగల కృష్ణ, కె. నరసింహారావు,మానుకొండ వెంకటేశ్వరరావు, ఆడపా ఆంజనేయులు, మడికంటి శ్రీను, వీరా నారాయణ, పెద్ద సంఖ్యలో అయ్యప్ప స్వాములు, గ్రామస్థులు పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.

## పరిశుభ్రత లక్ష్యంగా కార్పొరేషన్లో స్పెషల్ డ్రైవ్

- కాల్వల పూడికతీత ముమ్మరంగా చేపడుతున్నాం
- కాల్వలపై అక్రమ నిర్మాణాలు చేపట్టొద్దు
- డివిజన్లలో మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం
- ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తున్నాం
- కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్





**ఖమ్మం, అక్టోబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) :**
కొత్తగూడెం : కార్పొరేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణను మెరుగుపరిచేందుకు సమగ్ర కార్యాచరణతో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ ప్రారంభించినట్లు కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ తెలిపారు. కొత్తగూడెం, పాల్వంచ, సుజాతనగర్ పరిధిలోని అన్ని డివిజన్లలో సోమవారం క్షేత్రస్థాయిలో చేపట్టిన స్పెషల్ డ్రైవ్ పనులను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పలు డివిజన్లలో పర్యటించి పనుల పురోగతిని సమీక్షించిన అనంతరం మేయర్ మాట్లాడారు. నగర ప్రజారోగ్యాన్ని కాపాడటంలో శానిటేషన్ విభాగం పనితీరు అత్యంత కీలకమని, బస్తీలు, వీధుల్లో నిల్వ ఉన్న చెత్త చెదారాన్ని వెంటనే తొలగించాలని ఆదేశించారు. ప్రధాన రహదారులతో పాటు అంతర్గత వీధుల్లో పేరుకుపోయిన ముళ్లపొదలను పూర్తిగా తొలగించి రోడ్లను శుభ్రంగా ఉంచాలని సూచించారు. మురుగునీరు నిలవకుండా నిరంతరం కాల్వల్లో పూడికతీత పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. కాల్వలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టొద్దని, కాల్వలను ఆక్రమిస్తే ఉపేక్షించేదిలేదన్నారు. వ్యాధులు ప్రబలకుండా ముందుస్తు జాగ్రత్తగా పారిశుధ్య పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని పేర్కొన్నారు. ఈ డ్రైవ్‌లో శాశ్వత సిబ్బందితో పాటు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సమన్వయంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు. ప్రతి డివిజన్ పరిధిలో ప్రజల నుండి వచ్చే పారిశుధ్య సమస్యల ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహించకుండా వెంటనే స్పందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. వార్డుల వారీగా శానిటేషన్ ఇన్స్ప◌క్టర్లు నిత్యం పర్యవేక్షణ చేపడుతూ నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని అయన సూచించారు.రక్షణ కోసం ఏర్పాటు చేసిన వ్యవస్థ ప్రజలకు ఎంతవరకు ఉపయోగ పడుతోంది? ఖమ్మం జిల్లా అధికారులు ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది మరి.

## గుంటూరు ప్రగతికి సహకరించండి



- మేయర్ అభ్యర్థి లక్ష్మీ అపర్ణ విజ్ఞప్తి
- బ్రాడీపేటలో ప్రచార హోరు..
- గుంటూరులో వేల కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు: కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్
- మేయర్ అభ్యర్థి లక్ష్మీ అపర్ణ, కార్పొరేటర్ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి

**గుంటూరు, అక్టోబర్ 27(జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరునగర కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బ్రాడీపేటలో కూటమి నాయకులు విస్తృతంగా పర్యటించారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, కూటమి మేయర్ అభ్యర్థి శ్రీమతి కోవెలమూడి లక్ష్మీ అపర్ణతో పాటు పలువురు కూటమి నాయకులు ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికులను ఆత్మీయంగా పలకరిస్తూ నగర అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందన్నారు. ఇప్పటికే నగరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని, రానున్న రోజుల్లో గుంటూరును మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే గల్లా మాధవి మార్గదర్శకత్వంలో నగర అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తామని పేర్కొన్నారు. ఈ లక్ష్య సాధనకు ప్రజల సహకారం ఎంతో అవసరమని అన్నారు.

నవంబర్ 1న జరిగే ఎన్నికల్లో తనకు, 76 డివిజన్ల కార్పొరేటర్ అభ్యర్థులకు ఓటు వేసి మద్దతు అందించాలని లక్ష్మీ అపర్ణ విజ్ఞప్తి చేశారు.

**కేంద్ర సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలు...**

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ, గుంటూరు నగరంలో వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో పలు రైల్వే ఓవర్ బ్రిడ్జిలు (ఆర్ఓబీలు) నిర్మిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అనేక విధాలుగా సహకారం అందిస్తోందన్నారు. గుంటూరు నగరాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణతో పాటు కూటమి కార్పొరేటర్ అభ్యర్థులను గెలిపించి, అఖండ మెజారిటీ అందించాలని ప్రజలను కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరావు, రాష్ట్ర సహ ఇన్‌చార్జి వనతి శ్రీనివాసన్, జిల్లా ఇన్‌చార్జి దొరబాబు, బీజేపీ అధికార ప్రతినిధి యామిని శర్మ, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు శనక్కాయల రాధా మాధవి, మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి హరి పావని, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నడ్డి నాగమల్లేశ్వరి, రాష్ట్ర అధికార ప్రతినిధి బొల్లాప్రగడ శ్రీదేవి, 41వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి గాయత్రి బెహరా, 43వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి గాయత్రి, జిల్లా ప్రధాన కార్యదర్శి భజరంగ్ రామకృష్ణ, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ వెలగలేటి గంగాధర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్ జూనియర్ కాలేజీల్లో ఇంటర్మీడియట్ యాక్షన్ ప్లాన్‌ను వాయిదా

- ఎంఎస్‌పీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ షఫీ

**అమరావతి, అక్టోబర్ 27(జర్నలిస్ట్ ఫైల్):** ఏపీ మోడల్ స్కూల్ జూనియర్ కాలేజీల్లో ఈ నెల 26వ తేదీ నుంచి అమలు చేయాలని సూచించిన ఇంటర్మీడియట్ యాక్షన్ ప్లాన్‌ను డిసెంబర్ వరకు వాయిదా వేయాలని మోడల్ స్కూల్స్ ప్రోగ్రెసివ్ టీచర్స్ అసోసియేషన్ (ఎంఎస్‌పీటీఏ) రాష్ట్ర అధ్యక్షుడు కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ షఫీ విద్యాశాఖ అధికారులను కోరారు. ఇప్పటికే జూలై నెల నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థులకు సాయంత్రం 5 గంటల వరకు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం డిసెంబర్ నాటికి సిలబస్ పూర్తి చేయాల్సి ఉన్న పరిస్థితుల్లో మళ్లీ ఉదయం 8 గంటల నుంచే విద్యార్థులకు స్టడీ అవర్స్ నిర్వహిస్తూ యాక్షన్ ప్లాన్ అమలు చేయాలని ఆదేశించడం ఉపాధ్యాయులపై అదనపు పనిభారం మోపడంతో పాటు మానసిక ఒత్తిడికి గురిచేస్తుందని పేర్కొన్నారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు ఇప్పటికే అధిక పనిభారంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ సమయంలో ఇంటర్మీడియట్ యాక్షన్ ప్లాన్ అమలు చేయాలని ఆదేశించడం బాధాకరమని వారు అన్నారు. విద్యార్థుల సిలబస్ పూర్తి చేయడంపై దృష్టి సారించేందుకు అవకాశం కల్పించాలని కోరారు. అందువల్ల ఉపాధ్యాయులు, విద్యార్థుల పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఇంటర్మీడియట్ యాక్షన్ ప్లాన్‌ను వెంటనే వాయిదా వేసి, సిలబస్ పూర్తయ్యే వరకు అంటే డిసెంబర్ నెల వరకు అమలు చేయకుండా నిలిపివేయాలని ఎంఎస్‌పీటీఏ నాయకులు విద్యాశాఖ అధికారులను విజ్ఞప్తి చేశారు.

## 59వ డివిజన్‌లో లక్ష్మీ అపర్ణ ఆత్మీయ సమావేశం



**గుంటూరు, అక్టోబర్ 27(జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగర కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 59వ డివిజన్‌లోని ముత్యాలరెడ్డి నగర్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎన్డీఏ కూటమి మేయర్ అభ్యర్థి శ్రీమతి కోవెలమూడి లక్ష్మీ అపర్ణ పాల్గొన్నారు.

మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణ మాట్లాడుతూ..నవంబర్ 1న సైకిల్ గుర్తుకు ఓటు వేసి 76 డివిజన్ల కార్పొరేటర్ అభ్యర్థులకు కూడా ఓటు వేయాలని నగరంలో ప్రస్తుతం కొనసాగుతున్న అభివృద్ధి పనులు మరింత వేగంగా ముందుకు సాగేందుకు తనకు మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, రాష్ట్ర శిల్పకళా చైర్మన్ మంజుల రెడ్డి, మాజీ మేయర్ కోవెలమూడి రవీంద్ర,( నాని ), తాడికొండ మాజీ ఎమ్మెల్యే కుమార్తె ఉమాదేవి, అబ్బూరి మల్లి, భాష్యం నరసయ్య, 59వ డివిజన్ కూటమి కార్పొరేటర్ అభ్యర్థి పేరం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఏకగ్రీవాలైన ఎంపీటీసీ(టీడీపీ )అభ్యర్థులు

**బ్రహ్మంగారిమఠం( జర్నలిస్ట్ ఫైల్ ):** 1.మల్లేపల్లె – చిలమల ఈశ్వరమ్మ, 2.తొట్లపల్లె – కొడవటికంటి ఒబయ్య, 3.సోమిరెడ్డిపల్లి 1 – చిట్వేలి స్వర్ణ లత, 4.సోమిరెడ్డిపల్లి 2 – పూజ ఉమా దేవి, 5.సోమిరెడ్డిపల్లి 3 – బాలగాని వీర నారాయణ, 6.రేకలకుంట – కానాల మాధవి, 7.దిరసవంచ – వేల్పుల జయలక్ష్మి, 8.టి.సౌదరవారిపల్లె – బసిరెడ్డి భాస్కర్ రెడ్డి, 9.పలుగురాళ్లపల్లె – బసిరెడ్డి దుగ్గిరెడ్డి, 10.ముడమాల – గుడిమె జయరాములు. మంగళవారం నాడు ఏకగ్రీవంగా ఎన్నికైన అభ్యర్థులకు డిక్లరేషన్ ఫారాలు అందించినట్టు రిటర్నింగ్ అధికారి నాగయ్య తెలిపారు.

## కూటమిది అభివృద్ధి.. వైసీపీది విధ్వంసం : ఎమ్మెల్యే నసీర్

- మీ ఓటుతోనే గుంటూరుకు మంచి రోజులు
- తట్ట మట్టి కూడా వేయలేని వారు ఓటు ఎలా అడుగుతారు
- కూటమి అభ్యర్థులను మనసారా ఆశీర్వదించండి
- 13,14,15,16 డివిజన్ల ఎన్నికల ప్రచారంలో గుంటూరు ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు, అక్టోబర్ 27(జర్నలిస్ట్ ఫైల్):** 'గత వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి అనే మాట వినిపించకుండా పోయింది. నియోజకవర్గంలో రోడ్లన్నీ గోతులమయమై, అడుగు తీసి అడుగు వేయడానికే భయపడేలా శిథిలమైపోయాయి. చిన్నపాటి వర్షానికే మురుగు కాల్వలు పొంగిపొర్లుతూ పారిశుద్ధ్యం పడకేసింది. సంక్షేమం పేరిట కేవలం బటన్ నొక్కి మభ్యపెట్టారు. కేవలం ఐదేళ్ల కాలంలోనే అభివృద్ధిలో నియోజకవర్గాన్ని 20 ఏళ్ల వెనక్కి తీసుకెళ్లారు. రెండేళ్లలోనే ఛిద్రమైన రోడ్లపై గుంతలను పూడ్చడమేగాక డ్రెయిన్ల నిర్మాణం చేపట్టాం. మూలనపడ్డ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణాలకు నిధులు విడుదల చేసి, పనులను పరుగులు తీయించాం. అందుకే నాటి విధ్వంసాన్ని నేటి అభివృద్ధిని పరిశీలించుకోండి. ప్రగతికి ఓటు వేసి ఆశీర్వదించండి. మీ ఓటుతోనే గుంటూరుకు మరింత మంచి రోజులు వస్తాయి' అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. మంగళవారం స్థానిక 13, 14, 15, 16 డివిజన్లలో కూటమి బలపరిచిన కార్పొరేటర్ అభ్యర్థులు గాలి సతీష్ బాబు గౌడ్, ఎల్లావుల సౌజన్య ఎస్ఎం ముజహరుద్దీన్, సయ్యద్ ఆసియా షాహియాలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ ప్రతి ఇంటికి వెళ్లి కూటమి పాలనలో రెండేళ్లలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాల గురించి ఓటర్లకు వివరించారు. వైసీపీ కారణంగా ప్రజలు ఎంత నష్టపోయారనేది తెలియజేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థులను గెలిపించడం ద్వారా గుంటూరు నగరాభివృద్ధికి బాటలు వేయచ్చని చెప్పారు. ప్రతి ఒక్కరూ స్థానికంగా తమకు అండగా నిలిచే కూటమి నాయకులను గెలిపించాలని కోరారు. ఏ సమయంలోనైనా ఒక్క ఫోన్ కాల్ తో తాము స్పందిస్తున్నామని తెలిపారు.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజనరీ లీడర్ అని, రాష్ట్ర భవిష్యత్తు ఆయన సాధ్యమని, ఓటర్లు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు.

## కూటమికి ఓటమి తప్పదు : ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి

- జైత్రయాత్రలా సాగుతున్న ప్రచారం



**గుంటూరు, అక్టోబర్ 27(జర్నలిస్ట్ ఫైల్):** అది చేస్తాం.. ఇది చేస్తాం.. అని చెప్పడమే తప్ప ఏదీ చేయని చంద్రబాబు పాలనపై ప్రజలు విసుగెత్తి ఉన్నారని శాసనమండలి సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి వ్యాఖ్యానించారు. ప్రభుత్వానికి తగిన గుణపాఠం నేర్పించేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ నేపథ్యంలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి ఓటమి తప్పదని ఆయన స్పష్టం చేశారు.

గుంటూరు నగరంలో శాసనమండలి సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి ఎన్నికల ప్రచారం జన నీరాజనం నడుమ జైత్రయాత్రలా కొనసాగుతుంది. మంగళవారం ఉదయం 37వ డివిజన్‌లో కార్పొరేటర్ అభ్యర్థి చల్లా కోటేశ్వరరావు, మేయర్ అభ్యర్థిని తాడికొండ శ్రీదేవి, స్థానిక పార్టీ నేతలు, పెద్దలతో కలిసి ఆయన విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ పడాల సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డివిజన్ ఆసాంతం విస్తృతంగా పర్యటించి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థి చల్లా కోటేశ్వరరావు, మేయర్ అభ్యర్థిని తాడికొండ శ్రీదేవిని అఖండ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లకి పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ, మోసపూరిత మాటలతో గద్దెనెక్కిన చంద్రబాబు తాను ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలలో ఒక్కటంటే ఒక్కటి కూడా సంపూర్ణంగా నెరవేర్చలేదని ఆరోపించారు. కనీసం ఆకాశాన్నంటుతున్న నిత్యావసరాల ధరలను కూడా అదుపు చేయలేని అసమర్థ ప్రభుత్వం రాజ్యమేలుతుందన్నారు. విజ్ఞులైన ప్రజలు అంతా గమనిస్తున్నారని ఆయన తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన మేలును, ప్రస్తుత కూటమి పాలనలో జరుగుతున్న కీడుతో భేరీజు వేసి చూసుకుంటున్నట్లు ఆయన చెప్పారు. తమ వద్ద ఉన్న ఓటు అనే విలువైన వజ్రాయుధంతో కూటమి ప్రభుత్వాన్ని కూకటి వేళ్లతో పెకిలించి వేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి వెల్లడించారు.

ప్రచారంలో రాతంశెట్టి సీతారామాంజనేయులు, బందా రవీంద్రనాథ్, అంగడి శ్రీనివాసరావు, దేవానంద్, టీఎల్వీ వీరాంజనేయులు, మాజీ కార్పొరేటర్లు షేక్ రోషన్, అచ్చాల వెంకటరెడ్డి, ఉడుముల శ్రీనివాసరెడ్డి, మహమూద్, రమణారెడ్డి, జానీ, సాంబశివరావు, బ్రహ్మారెడ్డి, వినోద్, మనోజ్, జైబాబు, శివారెడ్డి, విజయ భాస్కర రెడ్డి, శేఖర్, రాజేష్, జగన్ కోటి, అబ్రహం, సాంబయ్య, రఫి, శ్రీను, నర్సిరెడ్డి, రమాదేవి, రమణ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

## స్ట్రాంగ్ రూమ్‌లు, పంపిణీ కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్



**గుంటూరు, అక్టోబర్ 27(జర్నలిస్ట్ ఫైల్):** స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా స్ట్రాంగ్ రూమ్ లు, పంపిణీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి సి.యం.సాయికాంత్ వర్మ మంగళవారం తనిఖీ చేశారు. గుంటూరు నగర పాలక సంస్థ ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రంగా గుంటూరు ఆంధ్రా ముస్లిం కళాశాలను వినియోగిస్తుండగా, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్ లు, కౌంటింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా పరిషత్ ఎన్నికలకు సైతం విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్ లు, కౌంటింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు. గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు లతో కలిసి జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. పంపిణీ కేంద్రం వద్ద సామాగ్రి పూర్తి స్థాయిలో ఉండాలని, ఏ సామాగ్రి లోటు ఉండరాదని ఆదేశించారు. ఫలహారం, మధ్యాహ్న భోజన ఏర్పాట్లను ఎన్నికల సిబ్బందికి చేయాలని అన్నారు. రూట్ ల వారిగా వాహనాలు సిద్ధంగా ఉండాలని, పిఓలు, ఏపిఓలు, సిబ్బంది హాజరు చూడాలని అన్నారు.

ఎన్నికల సామాగ్రి స్వీకరణ (రిసెప్షన్) కేంద్రం వద్ద వాహనాల రాకపోకలపై స్పష్టత ఉండాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోను ట్రాఫిక్ జామ్ సమస్య ఉండరాదన్నారు. ఎన్నికల సిబ్బంది వాహనం దిగి నేరుగా రిసెప్షన్ కౌంటర్ వద్ద ఎటువంటి ఆలస్యం లేకుండా సామాగ్రి అప్పగించాలని చెప్పారు. రిసెప్షన్ కౌంటర్ వద్ద తగినంత సిబ్బందిని నియమించాలని సూచించారు. సిబ్బందికి మంచి నాణ్యమైన ఆహారం అందించాలని అన్నారు. స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాల్ ల వద్ద సిసి కెమెరా ఏర్పాటు పక్కాగా ఉండాలని సూచించారు. మీడియా కేంద్రం ఏర్పాటు చేయాలని అన్నారు. పంపిణీ కేంద్రం, రిసెప్షన్ కౌంటర్ వద్ద ఎటువంటి అసౌకర్యం, ఆలస్యం లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఓట్ల లెక్కింపు సజావుగా జరుగుటకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, నగరపాలక సంస్థ కమిషనర్ పర్యవేక్షక ఇంజనీర్ వెంకటేశ్వర రావు, సి.పి.ఓ రాంబాబు, డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి జి.శ్రీనివాస్, విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజనీర్ సి.హెచ్.రమేష్, డి.ఎస్.పి ఎస్. కాంతా రావు, వెంకటేశ్వర్లు, మెప్మా పిఓ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

## సమస్యాత్మక గ్రామాల్లో పోలీసుల కవాతు



**గుంటూరు, అక్టోబర్ 27(జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు జిల్లాలో జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సజావుగా నిర్వహించేందుకు జిల్లా పోలీసులు పటిష్టమైన ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు మంగళవారం ప్రత్తిపాడు సర్కిల్ పరిధిలోని పెదగొట్టిపాడు, పెదనందిపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొప్పర్రు గ్రామాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు భద్రతపై భరోసా కల్పించడం, శాంతిభద్రతలను పరిరక్షించడం, ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించడం లక్ష్యంగా కవాతు నిర్వహించారు.

పెదగొట్టిపాడు గ్రామంలో మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 1.30 గంటల వరకు, కొప్పర్రు గ్రామంలో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 2.50 గంటల వరకు పోలీసు బలగాలు కవాతు నిర్వహించాయి. దక్షిణ డీఎస్పీ జి. పూర్ణచంద్రరావు పర్యవేక్షణలో జరిగిన ఈ కవాతులో ప్రత్తిపాడు సీఐ సుబ్బారావు, ప్రత్తిపాడు ఎస్ఐ నరహరి, పెదనందిపాడు ఎస్ఐ ఏకనాథ్‌తో పాటు దక్షిణ సబ్‌డివిజన్ పోలీసు సిబ్బంది, ప్రత్యేక దళాల సిబ్బంది పాల్గొన్నారు. క్రమశిక్షణతో కవాతు నిర్వహించిన పోలీసు బలగాలు ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసుశాఖ చేపడుతున్న చర్యలను ప్రజలకు వివరించాయి.

పెదగొట్టిపాడు గ్రామంలోని ప్రధాన బజార్, ఎస్సీ కాలనీ, చెరువు ప్రాంతాల మీదుగా పోలీసు కవాతు కొనసాగింది. అదేవిధంగా కొప్పర్రు గ్రామంలోని ప్రధాన బజార్, ఎస్సీ కాలనీ, బొడ్రాయి సెంటర్ ప్రాంతాల్లో పోలీసు బలగాలు కవాతు నిర్వహించాయి. ప్రధాన రహదారులు, నివాస ప్రాంతాల గుండా నిర్వహించిన ఈ కవాతుతో ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించడంతో పాటు ఎన్నికల ప్రక్రియపై విశ్వాసాన్ని బలోపేతం చేసేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు చర్యల్లో భాగంగా సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించారు.

ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాలు, ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి స్థానిక పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించినా, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసినా, ఓటు వేయకుండా అడ్డుకున్నా, ప్రలోభాలకు గురిచేసినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించే వారిపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని స్పష్టం చేశారు.

ప్రజలు ఎలాంటి భయాలు, ఒత్తిళ్లు, ప్రలోభాలకు లొంగకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సమయంలో ఎవరైనా ఓటర్లను బెదిరించినా, ప్రలోభపెట్టినా లేదా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడినా పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగేందుకు ప్రజలు పోలీసుశాఖకు సహకరించాలని కోరారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిష్పక్షపాతంగా, ప్రశాంతంగా జరిగేలా చూడడంతో పాటు ప్రజల భద్రతకు భరోసా కల్పించడం, శాంతిభద్రతలను పరిరక్షించడం లక్ష్యంగా గుంటూరు జిల్లా పోలీసుశాఖ నిరంతరం పనిచేస్తోందని అధికారులు తెలిపారు.

## కూటమి అభ్యర్థుల విజయానికి సమన్వయంతో పనిచేయాలి



- అమృతలూరు, వేమూరు, కొల్లూరు మండలాల టీడీపీ అభ్యర్థులకు బి-ఫారాలు అందజేసిన నక్కా ఆనంద బాబు

**వేమూరు , అక్టోబర్ 27(జర్నలిస్ట్ ఫైల్):** స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి అభ్యర్థుల విజయానికి మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనంద బాబు పిలుపునిచ్చారు. వేమూరు నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో అమృతలూరు, వేమూరు, కొల్లూరు మండలాల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తున్న టీడీపీ అభ్యర్థులకు ఆయన బి–ఫారాలు అందజేశారు.

ఈ సందర్భంగా అభ్యర్థులు ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన తదుపరి కార్యక్రమాలను నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని నక్కా ఆనంద బాబు సూచించారు. ఎన్నికల నిబంధనలను పాటిస్తూ ప్రచారం నిర్వహించాలని, పార్టీ నిర్ణయాలకు అనుగుణంగా ముందుకు సాగాలని తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి నాయకులు, కార్యకర్తలు ఏకాభిప్రాయంతో, పరస్పర అవగాహనతో ఐకమత్యంగా పనిచేయాలని ఆయన కోరారు. ప్రజా సంక్షేమం, గ్రామాల అభివృద్ధిని ప్రధాన లక్ష్యాలుగా చేసుకుని కూటమి పార్టీల మధ్య సమన్వయం, పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని సూచించారు.

కూటమి తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థుల విజయానికి మూడు పార్టీల శ్రేణులు సమష్టిగా కృషి చేయాలని, ముఖ్యంగా జనసేన ఎంపీటీసీ అభ్యర్థులకు టీడీపీ శ్రేణులు పూర్తి సహకారం అందించాలని నక్కా ఆనంద బాబు పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో కూటమి ఐక్యతను మరింత బలోపేతం చేస్తూ అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో అమృతలూరు, వేమూరు, కొల్లూరు మండలాలకు చెందిన అభ్యర్థులు, టీడీపీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత



- ఆత్మీయ సమావేశంలో ఎన్డీఏ కూటమి మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణ

**గుంటూరు, అక్టోబర్ 27(జర్నలిస్ట్ ఫైల్):** నగర అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాల మెరుగుదలకు ప్రాధాన్యత ఇస్తామని ఎన్డీఏ కూటమి మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణ తెలిపారు. గుంటూరు నగర కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాకుమానువారి తోట 5వ లైన్‌లో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆమె పాల్గొన్నారు.

ఈ సందర్భంగా స్థానికులను ఆత్మీయంగా పలకరిస్తూ వారి సమస్యలు, అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. నగర అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టడంతో పాటు ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని లక్ష్మీ అపర్ణ తెలిపారు. స్థానిక సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు.

రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థులకు మద్దతు తెలిపి విజయానికి సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. సమావేశంలో తాడిశెట్టి ఉత్తేజ్, దేవరపు సాంబశివరావు, ఏలూరు నాగేశ్వరరావు, తిరువీధి కృష్ణ, బాబు నాయుడు, రావెల వెంకటయ్య, యాగంటి దుర్గారావు, జి. ప్రభాకర్, ముప్పవరపు భారతి, ఏనుగంటి రవి, పులివర్తి శ్రీనివాసరావు, మల్లెంపూడి శ్రీనివాసరావు, మర్రిపాటి శ్రీనివాస్, శబరి తదితరులు పాల్గొన్నారు.

## రేకలకుంట ఎంపీటీసీగా కానాల మాధవి ఏకగ్రీవం



**బ్రహ్మంగారి మఠం(జర్నలిస్ట్ ఫైల్):** రేకలకుంట ఎంపీటీసీగా టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు కానాల మల్లికార్జునరెడ్డి భార్య మాధవి రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారుఈ మేరకు ఫార్మ్ 10 ఫారాన్ని ఆర్వో నాగయ్య నుంచి కానాల మాధవి తరపున ఆమె భర్త జిల్లా తెదేపా పార్టీ ఉపాధ్యక్షుడు కానాల మల్లికార్జున రెడ్డి అందుకున్నారు. చిత్రంలో ఎంపీడీవో వరప్రసాద్,మండల తెదేపా అధ్యక్షుడు చెన్నుపల్లె సుబ్బారెడ్డి , కాబోయే ఎంపీపీ భర్త పూజ శివ యాదవ్ , సొసైటీ చైర్మన్ సాంబశివారెడ్డి తదితరులు ఉన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# కూటమి ప్రచార హోరు



- గుంటూరు వీధుల్లో కూటమి రోడ్"షో" కు జనసంద్రం
- కేంద్రమంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే గల్లా మాధవి, మేయర్ అభ్యర్థి లక్ష్మీ అపర్ణ ప్రచారానికి ప్రజల భారీ స్పందన
- 58, 59, 60, 61, 42వ డివిజన్లలో హోరెత్తిన కూటమి ఎన్నికల ప్రచారం

**గుంటూరు, అక్టోబర్ 27(జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగర కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్‌షోకు ప్రజల నుంచి విశేషస్పందన లభించింది. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే గల్లా మాధవి, ఎన్డీఏ కూటమి మేయర్ అభ్యర్థి శ్రీమతి కోవెలమూడి లక్ష్మీ అపర్ణతో పాటు ఆయా డివిజన్ల కార్పొరేటర్ అభ్యర్థులు, స్థానిక టీడీపీ నాయకులు, కూటమి శ్రేణులు ఈ రోడ్‌షోలో పాల్గొన్నారు. భారీ సంఖ్యలో ప్రజలు తరలిరావడంతో ప్రచార మార్గమంతా సందడిగా మారింది.

58, 59, 60, 61, 42వ డివిజన్ల పరిధిలో సాగిన ఈ రోడ్‌షో కోరిటిపాడు గాంధీ బొమ్మల సెంటర్ నుంచి ప్రారంభమైంది. కోరిటిపాడు లైబ్రరీ సెంటర్ మీదుగా చైతన్యపురి మెయిన్ రోడ్డు, ముత్యాలరెడ్డి నగర్ మెయిన్ రోడ్డు, వేలంగిని నగర్ ఆర్చి, అమరావతి రోడ్డు, అమరావతి మెయిన్ రోడ్డులోని ఆల హాస్పిటల్ మీదుగా కొనసాగింది. అనంతరం పీఎస్ నగర్ మెయిన్ రోడ్డు, చంద్రయ్య నగర్ సెంటర్ మీదుగా టీడీపీ జిల్లా పార్టీ కార్యాలయం చేరుకుని, అక్కడి నుంచి అరండల్‌పేట ఐదో లైన్ లైబ్రరీ సెంటర్ వరకు రోడ్‌షో ఉత్సాహంగా సాగింది.

రోడ్‌షోలో పాల్గొన్న కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే గల్లా మాధవి, మేయర్ అభ్యర్థి లక్ష్మీ అపర్ణ కోవెలమూడికి ప్రజలు ఘన స్వాగతం పలికారు. పలుచోట్ల స్థానికులు పెద్ద సంఖ్యలో చేరుకుని తమ అభిమానాన్ని, మద్దతును వ్యక్తం చేశారు. మహిళలు, యువత, స్థానిక ప్రజల భాగస్వామ్యంతో ప్రచార కార్యక్రమం ఉత్సాహభరితంగా కొనసాగింది. కార్పొరేటర్ అభ్యర్థులు, స్థానిక టీడీపీ నాయకులు, కూటమి కార్యకర్తలు సమన్వయంతో ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్లారు.

ఈ సందర్భంగా కూటమి నాయకులు గుంటూరు నగర సమగ్ర అభివృద్ధి, మెరుగైన మౌలిక సదుపాయాలు, రహదారులు, డ్రైనేజీ, తాగునీటి సరఫరా, పారిశుధ్యం వంటి ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతను వివరిస్తూ ప్రజలను కలుసుకున్నారు. నగరాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

ప్రధాన రహదారుల వెంట భారీగా తరలివచ్చిన ప్రజలు, కూటమి శ్రేణుల నినాదాలు, నాయకులకు లభించిన స్వాగతాలతో రోడ్‌షోకు ప్రత్యేక ఆకర్షణ ఏర్పడింది. ఆయా డివిజన్లలో ప్రజల భాగస్వామ్యం, నాయకులు, కార్యకర్తల ఉత్సాహం ఎన్నికల ప్రచారానికి మరింత ఊపునిచ్చాయి. రోడ్‌షోలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే గల్లా మాధవి, ఎన్డీఏ కూటమి మేయర్ అభ్యర్థి శ్రీమతి కోవెలమూడి లక్ష్మీ అపర్ణతో పాటు జనసేన నాయకులు కిలారి రోశయ్య, మాదాల చైతన్య, వివిధ డివిజన్ల కార్పొరేటర్ అభ్యర్థులు, స్థానిక టీడీపీ నాయకులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# క్షయ వ్యాధి నిర్మూలనకు ఏర్పాట్లు

- యువత భాగస్వామ్యంతో వ్యాధి గుర్తింపు, చికిత్సకు ప్రాధాన్యం
- 28 జిల్లాల్లో 679 బ్లాక్‌లలో 'జోష్' బృందాలు

**అమరావతి, అక్టోబర్ 27(జర్నలిస్ట్ ఫైల్):** ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా క్షయవ్యాధి(టీబీ) నిర్మూలనలో యువత భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు రాష్ట్రంలో అమలు చేస్తున్న జోష్ (JOSH--Joint Squad for Health) కార్యక్రమంలో భాగంగా బ్లాక్ స్థాయి బృందాల ఏర్పాటు 100 శాతం పూర్తయ్యింది. రాష్ట్రంలోని 28 జిల్లాల పరిధిలో మొత్తం 679 బ్లాక్ స్థాయిల్లో బృందాలను ఇప్పటికే ఏర్పాటు చేసినట్లు వైద్య,ఆరోగ్య శాఖ నేడొక ప్రకటనలో తెలిపింది. నవంబరు నెలాఖరులోగా ఈ బృందాలకు శిక్షణ పూర్తి చేసి, క్షేత్ర స్థాయిలో పర్యటించేలా వైద్య,ఆరోగ్య శాఖ కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. దేశవ్యాప్తంగా క్షయ వ్యాధి నిర్మూలన చర్యల్ని మరింత వేగవంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన జోష్ కార్యక్రమాన్ని రాష్ట్రంలో 2026 అక్టోబర్ 8న ప్రారంభించారు.

జాతీయ క్షయ వ్యాధి నిర్మూలనా కార్యక్రమం కింద వ్యాధిని ముందుగానే గుర్తించడం, పరీక్షల సదుపాయాలు, వైద్య సేవలు, చికిత్సలు మెరుగుపరచడం, రోగులకు అవసరమైన సాయాన్ని అందించడంపై వైద్య,ఆరోగ్య శాఖ దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో టీబీ నిర్మూలనను మరింత వేగవంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వ లక్ష్యం మేరకు 'జోష్ – క్షయరహిత భారత్ అభియాన్' కార్యక్రమాన్ని రాష్ట్రంలో చేపట్టింది.

**క్షయవ్యాధి నిర్మూలనలో 'జోష్' బృందాల కీలక పాత్ర**

జిల్లాల్లోని ప్రతి బ్లాక్ స్థాయిలో ఎంపీడీఓ నోడల్ అధికారిగా వ్యవహరించే బృందంలో ఐదుగురు మై భారత్ వాలంటీర్లు, ఐదుగురు ఎన్‌సీసీ క్యాడెట్లు ఉన్నారు. క్షయవ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించడం, సమాజంలోని ప్రజలను కార్యక్రమంలో భాగస్వాములను చేయడం, వ్యాధి లక్షణాలున్న వారిని ముందుగానే గుర్తించి పరీక్షలు చేసుకునేలా ప్రోత్సహించడం ఈ బృందాల ప్రధాన బాధ్యతలు. నిక్షయ్ మిత్రల భాగస్వామ్యాన్ని పెంచడం, టీబీ బాధితులకు పోషకాహార బుట్టల(ఫుడ్ బాస్కెట్స్) పంపిణీకి సహకరించడం, మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా అవగాహన కల్పించడం, పరిశుభ్రతను ప్రోత్సహించడం, టీబీ ముక్త్ భారత్ అభియాన్ యాప్ వినియోగం గురించి ప్రజలకు తెలియజేయడం వంటి అవగాహన కార్యక్రమాలను ఈ బృందాలు చేపడతాయి.

జోష్ కార్యక్రమంలో భాగంగా బ్లాక్ స్థాయి బృందాలకు జిల్లా స్థాయిలో శిక్షణ ఇవ్వబోతున్నారు. క్షయవ్యాధి లక్షణాలు, వ్యాప్తి, నివారణా చర్యలపై అవగాహన కల్పించడంతో పాటు, ప్రజల్లో చైతన్యం పెంపొందించేలా శిక్షణ ఇవ్వనున్నారు . బ్లాక్ స్థాయిలో చేపట్టాల్సిన జోష్ కార్యక్రమాలకు సంబంధించి జిల్లా బృందం, సంబంధిత నోడల్ అధికారి సమన్వయంతో సూక్ష్మ కార్యాచరణ ప్రణాళిక (మైక్రోప్లాన్) రూపొందిస్తారు. సందర్శించాల్సిన ప్రాంతాలు, నిర్వహించాల్సిన కార్యక్రమాలు, బృందాల వారీగా బాధ్యతలు, గడువులను అందులో స్పష్టంగా పేర్కొంటారు.

**జిల్లా కలెక్టర్ల నేతృత్వంలో పర్యవేక్షణ**

జిల్లాస్థాయిలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన పనిచేసే టీబీ ముక్త్ భారత్ కమిటీలు జోష్ బృందాల కార్యకలాపాలను పర్యవేక్షించడం, వివిధ శాఖల మధ్య సమన్వయం, క్షేత్రస్థాయిలో కార్యక్రమాల్ని అమలు చేయడం వంటి అంశాలను పర్యవేక్షిస్తాయి.

# తెనాలి అభివృద్ధే కూటమి లక్ష్యం.. విజయమే ధ్యేయం!







- మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి
- పలు వార్డుల్లో విస్తృత ప్రచారం

**తెనాలి, అక్టోబర్ 27(జర్నలిస్ట్ ఫైల్):** తెనాలి మున్సిపల్ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. పట్టణ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కూటమి అభ్యర్థులకు మద్దతుగా ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ విస్తృత ప్రచారం నిర్వహించారు. కూటమి చైర్‌పర్సన్ అభ్యర్థి తోటకూర వెంకట రమణారావుతో కలిసి 45, 46, 47, 25, 26, 5 వార్డుల్లో పర్యటించిన ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. చైర్‌పర్సన్, కౌన్సిలర్ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు.

ప్రచారంలో భాగంగా ప్రజలు, స్థానిక నాయకులు, కార్యకర్తలతో ఆలపాటి రాజేంద్రప్రసాద్ మమేకమయ్యారు. తెనాలి పట్టణాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు కూటమి కట్టుబడి ఉందని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలంటే ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి వార్డుకు సముచిత ప్రాధాన్యం కల్పిస్తూ స్థానిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేపట్టడమే లక్ష్యమని వివరించారు.

**ప్రజా సమస్యల పరిష్కారమే తొలి ప్రాధాన్యం**

పారిశుధ్యం, తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాల మెరుగుదలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆలపాటి పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజాప్రతినిధులే ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోగలరని అన్నారు. ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా తెలియజేసే వాతావరణం కల్పించి, వాటి పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు.

**కూటమి అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం**

తోటకూర వెంకట రమణారావుతో కలిసి కౌన్సిలర్ అభ్యర్థులను ప్రజలకు పరిచయం చేస్తూ వారి విజయానికి సహకరించాలని ఆలపాటి కోరారు. ఎన్నికలు పదవుల కోసం జరిగే పోటీ మాత్రమే కాదని, ప్రజలకు సేవ చేసే అవకాశంగా భావించాలని అన్నారు. ప్రజల నమ్మకాన్ని గెలుచుకోవడంతో పాటు, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకునే బాధ్యత కూడా ప్రజాప్రతినిధులపై ఉంటుందని పేర్కొన్నారు. తెనాలి అభివృద్ధి, ప్రజల సంక్షేమమే కూటమి ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

**ఐక్యతతో ముందుకు.. విజయమే లక్ష్యం**

కూటమి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రచారాన్ని మరింత ఉధృతం చేయాలని ఆలపాటి పిలుపునిచ్చారు. వ్యక్తిగత ప్రయోజనాలకు అతీతంగా పట్టణ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకుంటూ ప్రతి వార్డులో విస్తృతంగా ప్రచారం కొనసాగించాలని కోరారు. తెనాలి అభివృద్ధికి ప్రజల ఆశీస్సులు, మద్దతు అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రచార కార్యక్రమాల్లో కూటమి నాయకులు, అభ్యర్థులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# గుంటూరు అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- 43వ డివిజన్ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తా: బీజేపీ అభ్యర్థి రంగావజ్జుల గాయత్రి



**గుంటూరు, అక్టోబర్ 27(జర్నలిస్ట్ ఫైల్):** నగర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని 43వ డివిజన్ కూటమి బీజేపీ అభ్యర్థి రంగావజ్జుల గాయత్రి అన్నారు. కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బ్రాడీపేటలో ఆమె విస్తృతంగా పర్యటించి ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. నగర అభివృద్ధి, స్థానిక సమస్యల పరిష్కారానికి సంబంధించిన అంశాలను ప్రజలకు వివరించారు.

కేంద్ర ప్రభుత్వం, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళు న్నారని గాయత్రి పేర్కొన్నారు. నగరంలో ఇప్పటికే పలు అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని, రానున్న రోజుల్లో 43వ డివిజన్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజల సమస్యలను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించేందుకు కృషి చేస్తానని, డివిజన్ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతామని చెప్పారు.

43వ డివిజన్ అభివృద్ధి లక్ష్యాల సాధనకు ప్రజల సహకారం ఎంతో అవసరమని గాయత్రి అన్నారు. ప్రచార కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాటిబండ్ల ఉషారాణి, జూపూడి రంగరాజు, యడ్లపాటి రఘునాథ బాబు, యడ్లపాటి స్వరూపరాణి, పాలపాటి రవికుమార్, రంగావజ్జుల లక్ష్మీపతి, పాటిబండ్ల నారాయణ భరద్వాజ్, హరి పావని, ఉయ్యాల శ్యాంవరప్రసాద్, రాజేష్ నాయుడు, వినోద్, కిరణ్, భూలక్ష్మి, సంధ్య, లక్ష్మయ్య, శ్రీహరి, ఆవుల వెంకటేశ్వరరావు, మోతే శేషగిరితో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తుఫాన్ ముప్పు నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు.. లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలి
- ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్



**విజయవాడ, అక్టోబర్ 27(జర్నలిస్ట్ ఫైల్):** ఆర్నబ్ తుఫాన్ ముప్పు నేపథ్యంలో తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ సూచించారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లవద్దని, లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలు అధికారుల సూచనల మేరకు ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని కోరారు.

తుఫాన్ గమనం మారే అవకాశం ఉన్నందున వాతావరణ శాఖ హెచ్చరికలను ప్రజలు ఎప్పటికప్పుడు గమనించాలని సూచించారు. ప్రాథమిక సమాచారం ప్రకారం తుఫాన్ కాకినాడ జిల్లా, యానాం పరిసర ప్రాంతాల వైపు పయనించే అవకాశం ఉన్నందున తీర ప్రాంత ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. తుఫాన్ తీరం దాటే సమయంలో గంటకు 140 నుంచి 150 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్న నేపథ్యంలో భారీ వర్షాలు, బలమైన గాలుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించి, పునరావాస కేంద్రాల్లో ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలని మాధవ్ సూచించారు. కృష్ణా, గుంటూరు జిల్లాలతో పాటు గోదావరి జిల్లాలు, కోనసీమ ప్రాంతాల ప్రజలు కూడా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. తాగునీరు, ఆహార పదార్థాలు, మందులు, ఇతర అత్యవసర వస్తువులను ముందుగానే సిద్ధం చేసుకోవాలని, విద్యుత్ స్తంభాలు, చెట్లు, బలహీనమైన నిర్మాణాలకు దూరంగా ఉండాలని సూచించారు.

రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సమన్వయంతో సహాయక చర్యలకు సిద్ధంగా ఉన్నాయని, అవసరమైన ప్రాంతాల్లో జాతీయ విపత్తు స్పందన దళం, రాష్ట్ర విపత్తు స్పందన దళం బృందాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్నప్పటికీ ప్రజల ప్రాణ రక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, అత్యవసర పరిస్థితుల్లో ఎన్నికల అధికారులు, ప్రభుత్వ యంత్రాంగం సూచనలను ప్రజలు తప్పనిసరిగా పాటించాలని కోరారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యవేక్షణలో రాష్ట్ర ప్రభుత్వం సహాయక చర్యలను సమర్థంగా నిర్వహించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మాధవ్ కోరారు. తుఫాన్‌పై ప్రజలు భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని, అప్రమత్తంగా ఉంటూ అధికారుల సూచనలు పాటించాలని తెలిపారు. తుఫాన్ కారణంగా ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ప్రజలంతా సురక్షితంగా ఉండాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.

# ఇక వైసీపీ పార్టీ దుకాణం మూతే..



- గత ఐదేళ్లలో అరాచకం విధ్వంసమే జగన్ పాలన
- కేవలం రెండేళ్లలోనే అభివృద్ధి సంక్షేమానికి పెద్దపీట
- తూర్పులో రూ.400 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు
- భరత్ రెడ్డి ఆధ్వర్యంలో చేరిన వైసీపీ మాజీ కార్పొరేటర్, డివిజన్ అధ్యక్షుడు
- టీడీపీలోకి సాదరంగా ఆహ్వానించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు, అక్టోబర్ 27(జర్నలిస్ట్ ఫైల్):** వైసీపీ పార్టీ దుకాణం మూసివేసేందుకు ఎక్కువ రోజులు లేవని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని చూసి ఇతర పార్టీల నుంచి నాయకులు వస్తున్నారని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. మంగళవారం స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో టీడీపీ నాయకులు భరత్ రెడ్డి ఆధ్వర్యంలో రెండో డివిజన్ వైఎస్ఆర్ సీపీ మాజీ కార్పొరేటర్ మర్రి అంజలి, ఆమె భర్త వైఎస్అర్ సీపీ డివిజన్ అధ్యక్షుడు మర్రి సత్యనారాయణ తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే నసీర్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ వైఎస్ఆర్ సీపీ అంటేనే అరాచకమని విమర్శించారు. గత ఐదేళ్ల వైసీపిజ పాలనలో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని మండిపడ్డారు. కనీసం రాజధాని కూడా లేని రాష్ట్రంగా మార్చిన దుర్మార్గమైన పాలన వైసీపీదన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో గత పదేళ్లుగాబఅభివృద్ధి అనే మాట ఎక్కడా కనిపించలేదని అన్నారు. ప్రధాన రోడ్లను సైతం గుంతలుగా మార్చిన దయనీన దయనీయ స్థితిలో ఉందన్నారు. కుహటమి ప్రభుత్వం వచ్చిన రెండేళ్ల కాలంలోనే 400 కోట్ల రూపాయలతో గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. నూతనంగా పార్టీలో చేరిన అంజలి, సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నాయుడు, నియోజకవర్గంలో ఎమ్మెల్యే నసీర్ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులమై తెలుగుదేశం పార్టీలో చేరామని తెలిపారు.

# ఆర్నబ్ తుపాను నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి



- స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ సీఎం సాయికాంత్ వర్మ

**గుంటూరు, అక్టోబర్ 27(జర్నలిస్ట్ ఫైల్):** ఆర్నబ్ తుపాను ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు పూర్తి అప్రమత్తతతో ఉండాలని జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ ఆదేశించారు. మంగళవారం తుపాను ముందస్తు చర్యలు, స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.

**తుపాను ముందస్తు చర్యలు:** తుపాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అన్ని ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పట్టణ ప్రాంతాల్లోని హోర్డింగులను వెంటనే తొలగించాలని, పోలీసు, రెవెన్యూ, ఇరిగేషన్, ఆర్అండ్‌బీ తదితర శాఖల మండల స్థాయి అధికారులు విధిగా తమ ప్రధాన కార్యాలయాల్లోనే అందుబాటులో ఉండాలని ఆదేశించారు. డెల్టా ప్రాంతంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండి, అవసరమైన సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలన్నారు. తుపాను ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు మండలాలకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు.

**స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధత:** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్, కౌంటింగ్ సిబ్బందికి అవసరమైన శిక్షణ కార్యక్రమాలను పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని, పోలింగ్ సామగ్రిని పూర్తిస్థాయిలో సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఓటరు స్లిప్పుల పంపిణీ ప్రక్రియను కూడా నిర్ణీత సమయంలో పూర్తిచేయాలన్నారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి లోపాలకు తావులేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

ఈ సమీక్ష సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

# విజయీభవ..! లక్ష్మీ అపర్ణకు కొల్లి శారద మద్దతు..

- అఖండ విజయం సాధించాలని పిలుపు
- అనుభవానికి ఆత్మీయ పలకరింపు..
- అపర్ణకు ఆశీస్సుల వెల్లువ!

**గుంటూరు, అక్టోబర్ 27(జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగరానికి సంబంధించిన సమస్యలు, ప్రజల ఆకాంక్షలు, నగరాభివృద్ధికి అవసరమైన ప్రాధాన్యతలపై సీనియర్ నాయకుల అనుభవం ఎంతో విలువైనది. వారి సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకుంటూ ప్రజలకు చేరువయ్యే పాలన అందించాలన్న దిశగా లక్ష్మీ అపర్ణ తన ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. నగరాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యానికి ప్రాధాన్యమిస్తూ, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునే నాయకత్వాన్ని అందించాలనే సంకల్పంతో ఆమె ఎన్నికల ప్రచారాన్ని సాగిస్తున్నారు.



గుంటూరు నగరపాలక సంస్థ ఎన్నికల ప్రచారంలో భాగంగా కోవెలమూడి లక్ష్మీ అపర్ణ మాజీ మేయర్ కొల్లి శారద నివాసానికి వెళ్లి ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శారదతో ఆత్మీయంగా మాట్లాడి, ఆమె ఆశీస్సులు తీసుకున్నారు.

మాజీ మేయర్ కొల్లి శారద మాట్లాడుతూ..గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు ఏడోసారి ఎన్నికలు జరగబోతున్నాయి. 1995లో గుంటూరు నగరానికి తొలి మహిళా మేయర్‌గా నేను ఎన్నికయ్యాను. మళ్లీ ఇన్నేళ్ల తర్వాత ఒక మహిళ మేయర్ అభ్యర్థిగా పోటీ చేయడం ఎంతో సంతోషకరమైన విషయం. ఆనాడు కూడా చంద్రబాబు నాయుడు గారే మా నాయకులు. ఇప్పుడు కూడా ఆయన నాయకత్వంలో మహిళలకు ప్రాధాన్యత కల్పించడం అభినందనీయం.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు మహిళలకు రాజకీయాల్లో సముచిత స్థానం కల్పిస్తూ, మున్సిపల్ ఎన్నికల్లో 58 శాతం మంది మహిళలకు అవకాశం కల్పించడం ఎంతో సంతోషదాయకం. మహిళలు కూడా సమర్థవంతంగా పనిచేయగలరు, సమర్థవంతమైన పాలన అందించగలరు.

కాబట్టి మన గుంటూరు నగర అభివృద్ధి కోసం ఎన్డీఏ కూటమి మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణ గారిని అఖండ మెజారిటీతో గెలిపించి, నగర అభివృద్ధికి మీరందరూ సహకరించాలని హృదయపూర్వకంగా కోరుకుంటున్నాను.

లక్ష్మీ అపర్ణ గారు సేవాభావం కలిగిన కుటుంబం నుంచి వచ్చారు. ఆమె కుటుంబ సభ్యులు సత్యసాయి సేవా సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు ఎంతో సేవ చేశారు.

అటువంటి సేవా స్ఫూర్తి కలిగిన కుటుంబం నుంచి వచ్చిన లక్ష్మీ అపర్ణ గారు కూడా ప్రజాసేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని నాకు తెలుసు.

ప్రజలకు సేవ చేయడానికి లక్ష్మీ అపర్ణ గారికి ఇది ఒక గొప్ప అవకాశం. ఆమె సేవా స్ఫూర్తిని గుంటూరు నగర అభివృద్ధికి వినియోగించుకునేలా ప్రజలందరూ ఆమెకు మద్దతుగా నిలిచి, అఖండ విజయాన్ని అందించాలని కోరుకుంటున్నాను అని గుంటూరు ప్రథమ మాజీ మేయర్ కొల్లి శారద అన్నారు.

Owned, Edited & Published by D.Ajay. Published from 126-352, 4Th Lane, Kodandarama Nagar, Gorlavaripalem Road, Gorantla, Guntur-522034 (A.P).
Printed by C.Sridhar Reddy at Teja Cards and Stationery, Shop no.1, 22-11-170, T.V Street, Lalapet,Guntur-522003(A.P.). Editor : D.Ajay. Phones: 7661805968, 9966319999. Email: dasariajjay@gmail.com